## బెంగళూరు ప్యాలెస్‌పై ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఓకే..

బెంగళూరు: బెంగళూరు ప్యాలెస్ మైదానం భూమి వినియోగానికి సంబంధించి ఆర్డినెన్స్ ద్వారా అవసరమైన స్థలాన్ని వాడుకోవడంతోపాటు నిర్దిష్ట రోడ్డు విస్తరణ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అవకాశం లభించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆర్డినెన్స్‌కు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ అంగీకారం తెలిపారు. 427 ఎకరాలు 16 గుంటల విస్తీర్ణంలోని బెంగళూరు ప్యాలెస్ స్థల వినియోగం, నియంత్రణ అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లభించింది. గత రాష్ట్రమంత్రివర్గ భేటీలో టీడీఆర్ ఇవ్వరాదని ప్రభుత్వం తీర్మానించింది. ఇందుకు సంబంధించి గవర్నర్ ఆమోదం తెలిపారు. సుమారు 3వేల కోట్ల రూపాయల విలువైన బెంగళూరు ప్యాలెస్ భూమికి సంబంధించి టీడీఆర్ విషయంలో మైసూరు రాజమాత, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య వివాదం సాగుతోంది.

RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 92 ఆదివారం 27 ఏప్రిల్ 2025 పేజీలు : 4




# గులాబీ శ్రేణుల్లో రజతోత్సవ...

# సంబురం!

## 'చలో ఎల్కతుర్తి'కి సమాయత్తం!!

హైదరాబాద్ : ఉద్యమ పార్టీగా పురుడు పోసుకున్న బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలకు ఉమ్మడి జిల్లాలోని గులాబీ శ్రేణులు సిద్ధమవుతున్నాయి. భారత రాష్ట్ర సమితి 24 ఏండ్ల ప్రస్థానం ముగించుకుని రజతోత్సవం వైపునకు పరుగులు పెడుతున్నది. ఈ నేపథ్యంలో (రేపు) ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభను పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ఇందుకోసం అక్కడ ముమ్మర ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

25 ఏండ్ల బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవంలో పాలుపంచుకునేందుకు పార్టీ కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నారు. కాంగ్రెస్ పాలనతీరుపై విసుగెత్తి పోతున్న ప్రజలు, బీఆర్ఎస్ అభిమానులు కేసీఆర్ సభకు హాజరుకావడానికి ఆసక్తి చూపుతున్నారు.

**బీఆర్ఎస్ 25 ఏండ్ల ప్రస్థానం...** బీఆర్ఎస్ 25 ఏండ్ల ప్రస్థానం నేపథ్యంలో ఈ ప్రత్యేక దినోత్సవాన్ని చరిత్రలో గుర్తుండి పోయేలా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కనీవినీ ఎరుగని రీతిలో భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. స్వరాష్ట్ర సాధనే ధ్యేయంగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్ర సమితి రెండున్నర దశాబ్దాల కాలంలో అనేక అద్భుత ఘట్టాలకు సాక్షాత్కారమై నిలిచింది. ఉద్యమ పార్టీగా ఆవిర్భవించిన బీఆర్ఎస్ దేశంలోనే ఒక ప్రత్యేకతను సాధించింది. తెలంగాణ రాష్ట్ర సాధనే ఏకైక ఎజెండాతో పురుడు పోసుకున్న టీఆర్ఎస్ నేడు బీఆర్ఎస్‌గా ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది. ఉద్యమ సమయంలో గులాబీ అధినేత కేసీఆర్ నేతృత్వంలో అనేక సభలు, సమావేశాలు నిర్వహించారు. ప్రతి జిల్లాలో ధూంధాం కార్యక్రమాలతో ప్రజల్లో రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను తెలియజేశారు. చారిత్రాత్మకమైన సభలతో ప్రపంచ రికార్డులను సైతం తిరగరాసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీకే దక్కింది. మలి దశ ఉద్యమంలో అలుపెరగని పోరాటాల ద్వారా ప్రాణాలను పణంగా పెట్టి ఆమరణ నిరాహార దీక్షతో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కేసీఆర్ సాధ్యం చేశారు. సమైక్యాంధ్ర పాలకుల కుట్రలను ఛేదిస్తూ, నాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇంటి దొంగల భరతం పడుతూ కేసీఆర్ సాగించిన ఉద్యమ కాలం చిరస్థాయి గా నిలిచిపోతుంది. ఆర్టీసీ బస్సులను ప్రత్యేకంగా అద్దెకు తీసుకున్నది. ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేని చోట ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను సైతం అందుబాటులో ఉంచనున్నారు. కేసీఆర్ సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండేందుకు ముందస్తు గా కట్టుదిట్టమైన సౌకర్యాలను కల్పించనున్నారు.

కొట్లాడి తెచ్చుకున్న స్వరాష్ట్రంలో నాటి టీఆర్ఎస్ నేటి బీఆర్ఎస్ పార్టీకే 2014, 2018లో జై కొట్టారు. అరవై ఏండ్ల ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌కు తొలి ముఖ్యమంత్రిగా ప్రజలంతా పట్టం కట్టారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బొటాబొటి ఓట్ల తేడాతో బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోయినప్పటికీ బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్రను విజయవంతం గా పోషిస్తూ తెలంగాణ రాష్ట్రం, ప్రజల కోసం అలుపెరగని పోరాటాల ను చేస్తున్నది.

ఉద్యమాల గడ్డ వరంగల్ జిల్లాలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే గులాబీ శ్రేణులతో సన్నాహక సమావేశాలు జోరుగా జరిగాయి. అన్ని నియోజక వర్గాల్లో స్థానిక మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీల సమక్షంలో సమన్వయ సమావేశాలు నిర్వహించారు. ఈ నెల 27న ఎల్కతుర్తికి రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు గులాబీ శ్రేణులకు సూచనలు, సలహాలు సైతం అందించారు.

## కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్.. 38 మంది మావోలు మృతి

ములుగు: తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో 38 మంది మావోయిస్టులు మృతిచెందారు. ఎదురుకాల్పుల్లో ఓ జావాన్‌కు గాయాలయ్యాయి. ప్రస్తుతం కర్రెగుట్టల్లో కాల్పులు కొనసాగుతున్నాయి. ఆపరేషన్ కగార్‌లో భాగంగా తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతం నివురుగప్పిన నిప్పులా మారింది. కర్రెగుట్టలే టార్గెట్‌గా భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. భద్రతాబలగాలు బాంబుల వర్షం కురిపిస్తున్నాయి. దీంతో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. దీంతో ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యంలో ఎప్పుడు ఏం జరుగుతుందో అనే టెన్షన్ వాతావరణం నెలకొంది. మావోయిస్టు పార్టీ నిర్మూలనే లక్ష్యంగా కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌తో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అంతా వార్‌జోన్‌గా మారింది. మావోయిస్టుల అగ్రనేతలే టార్గెట్‌గా సాగుతున్న ఆపరేషన్ కర్రెగుట్టల్లో గత నాలుగు రోజులుగా పెద్ద ఎత్తున కూంబింగ్ కొనసాగుతోంది. దీనిలో భాగంగా పెద్ద ఎత్తున మావోయిస్టులు హతమయ్యే అవకాశం ఉన్నట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఇక మావోయిస్టులకు పెట్టని కోటలాగా కర్రెగుట్టలు ప్రాంతం ఉంది.

145 ఎకరాల విస్తీర్ణం ఉన్న కర్రెగుట్టల చుట్టూ దాదాపు పదివేల మంది భద్రతా బలగాలు మోహరించి ఉన్నాయి. కర్రెగుట్టల్లో మావోయిస్టు సుప్రీం కమాండర్ హిడ్మాతో పాటు వేలాది మంది మావోయిస్టులు ఉన్నట్లు భద్రతాబలగాలు గుర్తించాయి. వారి లక్ష్యంగానే కర్రెగుట్టల్లో ఆపరేషన్ కగార్ కొనసాగుతోంది. ములుగు జిల్లా సరిహద్దు నుంచి ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లా వరకు అలాగే మహారాష్ట్రలో గడ్చిరోలి ప్రాంతంలో ఉన్న నదుల నుంచి మావోయిస్టులు తప్పించుకోకుండా మూడు వైపుల నుంచి భద్రతా బలగాలు చుట్టుముట్టాయి. దాదాపు కొద్ది రోజులుగా కర్రెగుట్టల్లో మావోయిస్టుల కోసం వేట కొనసాగుతోంది. అధునాత ఆయుదాలతో సాటిలైట్స్, డ్రోన్స్‌ను ఉపయోగిస్తూ మావోయిస్టులపై పై నుంచి బాంబుల వర్షం కురిపిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ భీకరమైన కాల్పుల్లో ఇప్పటి వరకు 38 మంది మావోయిస్టుల చనిపోయినట్లు తెలుస్తోంది. కాగా.. ఇప్పటి వరకు కర్రెగుట్టల్లో జరుగుతున్న భీకరకాల్పులపై ప్రజాస్వామ్య వాదులు, పౌరహక్కుల సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కర్రెగుట్టల నుంచి భద్రతాబలగాలు వెనక్కి తగ్గాలని చెబుతున్నారు. అయినప్పటికీ ఆపరేషన్ కగార్ మాత్రం కొనసాగుతోంది.




దేశం నడిబొడ్డున రాజ్యమే పౌరులపై యుద్ధం చేస్తోందని పౌరహక్కుల సంఘాలు పెద్దఎత్తున ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికైనా శాంతి చర్చలు జరపాలంటూ భారత్ బచావో పేరుతో ఓ లేఖను కూడా విడుదల చేశారు. అలాగే మావోయిస్టుల కేంద్ర కమిటీ కూడా పలుమార్లు లేఖలు విడుదల చేసి వినతి చేసింది. చర్చలకు తాము సిద్ధమంటూ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ నుంచి కిందిస్థాయి దళాల వరకు వినతి చేసినా అటు కేంద్ర ప్రభుత్వం కానీ, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కానీ స్పందించని పరిస్థితి.

ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వంతో శాంతి చర్చలకు బాటలు వేయాలని తెలంగాణ పౌరహక్కుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



## భారత్- పాకిస్థాన్ యుద్ధం లైవ్ కవరేజ్ బ్యాన్

పహల్గాం ఉగ్రదాడితో ఇప్పుడు పాకిస్థాన్- భారత్ మధ్య యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. దేశవ్యాప్తంగా ప్రజలు ప్రతీకార జ్వాలతో రగిలిపోతున్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ ను దెబ్బకు దెబ్బ తీయాలన్న కసితో భారత ప్రభుత్వం ఉంది. సరిహద్దుల్లో పరిస్థితి నివురు గప్పిన నిప్పులా ఉంది. యుద్ధం ఏ క్షణమైనా మొదలయ్యే అవకాశం ఉన్నట్లు నిఘా వర్గాలు వెల్లడిస్తున్నాయి. భారత్ పాకిస్థాన్ సరిహద్దుల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించడం కష్టంగా మారింది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. యుద్ధం లైవ్ కవరేజ్ బ్యాన్ చేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని న్యూస్ ఛానెల్స్, సోషల్ మీడియా ఛానెల్స్ ఇతర మీడియా సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. దేశ భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. " దేశ మిలిటరీ కార్యకలాపాలకు సంబంధించిన కవరేజ్ ను నిలిపేయాలని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కీలక ఆదేశాలు జా రీ చేసింది. దేశ భద్రత దృష్ట్యా.. అన్ని మీడియా ప్లాట్ ఫార్మ్ లు, వార్తా సంస్థలు, సోషల్ మీడియా సంస్థలు జాతీయ భద్రతకు సంబంధించిన సున్నితమైన వివరాలను రక్షించాల్సిన అవసరం ఉంది" అని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు తన అధికారిక ఎక్స్ ఖాతాలో రెండు పేజీల లేఖను పోస్ట్ చేసింది.

# టార్గెట్ పాక్!

## స్వాధీనానికి యుద్ధం!



కశ్మీర్‌లో కొంత భాగం ఇప్పటికీ పాకిస్తాన్ చెరలో ఉంది. దాన్ని పాక్ ఆక్రమిత కశ్మీర్ అని పిలుస్తున్నారు. అసలు పాకిస్తాన్ ఉగ్రవాద క్యాంపులన్నీ అక్కడే ఉంటాయి. హమాస్ ఉగ్రవాదులు కూడా ఇటీవల పీవోకేలో పర్యటించారని మీడియా రిపోర్టులు చెబుతున్నాయి. భారత్ కు వ్యతిరేకంగా పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు కుట్ర చేస్తున్నారు. పెహల్గాంలో జరిగిన దాడిలో హమాస్ పాత్ర ఉందా లేదా అన్నది పక్కన పెడితే.. భారత్ పై ఉగ్రవాద యుద్ధానికి పీవోకే ఎలా కీలకంగా మారుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు ఆ ప్రాంతాన్ని భారత్ స్వాధీనం చేసుకుంటే తప్ప..ఉగ్రవాదాన్ని అంతం చేయడం సాధ్యం కాదు.

**పాక్ ఆక్రమిత కశ్మీర్ నుంచే ఉగ్రవాదం..** కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని తుదముట్టించాలంటే ఆక్రమిత కశ్మీర్ స్వాధీనం చేసుకోవాల్సిందేనని రక్షణ నిపుణులు చాలా కాలంగా చెబుతున్నారు. గతంలో పీవోకేలోని ఆర్మీ క్యాంపులపై భారత సైన్యం సర్జికల్ దాడులు చేసింది. అయినా ఎప్పటికప్పుడు కొత్తగా పుట్టుకొస్తూనే ఉన్నారు. అందుకే.. పీవోకేను తిరిగి పొందాలన్న కృతనిశ్చయంతో.. కేంద్ర ప్రభుత్వం ఉంది. బీజేపీ నేతలు కూడా.. మోడీ, షా నిర్ణయాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. దౌత్య పరంగా.. చేయాల్సిన ప్రయత్నాలు చేస్తూనే.. ఇతర మార్గాలను రెడీ చేసుకోవాలంటున్నారు. ఉక్రెయిన్ పై రష్యా దాడులు చేసింది. తమ దేశంపై కుట్రలు చేయడానికి అనుకూలంగా ఉన్న ప్రాంతాలను స్వాధీనం చేసుకుంటోంది .

క్రిమియా అనే ప్రాంతాన్ని ఇచ్చేయాలని ట్రంప్ కూడా ఉక్రెయిన్ పై ఒత్తిడి. తెస్తున్నారు. పీవోకే విషయంలోనూ ఇలాంటి ప్రయత్నమే భారత్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది. పీవీ నరసింహా రావు ప్రధానిగా ఉన్న సమయంలో పీఓకేను వెనక్కి తీసేసుకోవాలని, అందులో మూడో దేశ జోక్యానికి అవకాశం ఇవ్వకూడదని ఒక తీర్మానం ఆమోదించారు. పీవోకేలోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ దాడి చేస్తే.. ట్రంప్ కూడా భారత్ కు మద్దతుగా ఉండే అవకాశం ఉంది.

**పీవోకే కోసం ప్రాణాలిస్తామని గతంలో అమిత్ షా ప్రకటన...** చైనా ఆధీనంలో ఉన్న ఆక్సాయ్ చిన్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీర్ రెండూ భారత్ లో భాగమే. వాటిని తిరిగి తెచ్చుకునేందుకు అమిత్ షా ఆర్టికల్ 370 రద్దు సమయంలో పార్లమెంట్లో ప్రకటించారు. పీఓకేను పాకిస్తాన్ అంత తేలిగ్గా వదులుకోదు. పీవోకేను.. సర్వనాశనం చేయడానికైనా అంగీకరిస్తుంది కానీ.. అప్పగించదు. సేనలు నేరుగా ఆక్రమిత కశ్మీర్‌లోకి వెళ్లిపోవడం మినహా వేరు గత్యంతరం కూడా లేదు. ఇప్పటికే రెండు సర్జికల్ దాడులతో సైన్యం సత్తా చూపించింది. అయితే పీఓకేను కలుపుకోవాలంటే చిన్న దాడులు సరిపోవు.. పెద్ద యుద్ధమే చేయాల్సి ఉంటుందన్న అభిప్రాయం నిపుణుల నుంచి వస్తోంది. భారతదేశమే మొదట దాడి చేసిందన్న అపవాదు రాకుండా ఇప్పుడు పెహల్గాం దాడి ఘటన ఉపయోగపడుతుంది.

**పాకిస్తాన్ ఆయువు మీద దెబ్బకొట్టాలి !** పీవోకే విషయంలో అంతర్జాతీయంగా పాకిస్తాన్ ను ఏకాకిని చేయండ భారత్‌కు ముఖ్యం. అయితే.. మోడీ , షాల నేతృత్వంలో అది పెద్ద విషయం కాదు. పీవోకేను.. భారత్‌లో చేర్చితే.. ప్రధాని మోడీ, అమిత్ షాలు చరిత్రలో నిలిచిపోతారు. ఎందుకంటే.. దేశ విభజన నాటి నుంచి.. సరిహద్దుల్ని ఉద్రిక్తతంగా ఉంచుతూ.. వస్తున్న.. సీమాంతర ఉగ్రవాదం.... అంతమైపోతుంది. విశాల భారత్ ఏర్పడుతుంది.

గరుడ వార్త



# సంపాదకీయం

## పాక్ కి భారత్ చేసినట్లే చైనా భారత్ కి ?

డ్రాగన్ చైనా సంగతి అందరికీ తెలిసిందే. పూర్తిగా తన దేశం కోసమే ఆలోచిస్తుంది. విస్తరించుకుంటూ పోవడమే అజెండాగా పెట్టుకుంటుంది ఈ విషయంలో బోర్డర్లు హద్దులు పద్దులూ వాదనలు బేఖాతర్ చేస్తుంది. ఏ రూల్ అయినా తనకు అనుకూలంగా ఉండాల్సిందే అని భావిస్తుంది. ఇక భారత్ తో చైనా సంబంధాలు గురించి అందరికీ తెలిసిందే. నోటితో కూడా నవ్వకుండా నొసటితో వెక్కిరించే తీరుని చైనా కనబరుస్తుంది అని అంటారు. భారత్ దక్షిణాసియాలో చైనాకు పోటీగా ఎదగరాదు అన్నదే పట్టుదలగా చెబుతారు. దాని కోసం చిన్నా చితకా దేశాలకు మద్దతు ఇస్తూ వాటిని మచ్చిక చేసుకుంటూ భారత్ ని ఇబ్బంది పెట్టే కార్యక్రమం చైనా చేస్తుంది అన్న ప్రచారమూ ఉంది. ఇక చైనాకు పాకిస్తాన్ దోస్తీనా కాదా అంటే అవసరాల కోసం పాక్ ని దువ్వుతుంది అని చెబుతారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ లో కొంత భాగం చైనాకు పాక్ రాసివ్వడం వెనక ఏ దోస్తీ ఉందో కూడా అందరికీ తెలిసిందే. ఇంకో వైపు చూస్తే కనుక పాకిస్థాన్ భారత్ ల మధ్య యుద్ధం వస్తే కనుక చైనా ఎవరి వైపు ఉంటుంది అన్నది అంతర్జాతీయ పరిణామాల మీద అవగాహన ఉన్న వారికి ఎరుకే అని అంటారు. ఇవన్నీ ఇలా ఉంటే ఇపుడు భారత్ పాకిస్థాన్ కి ఉచ్చు బిగిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా సింధు నదిని బంద్ చేయడం ద్వారా ఆటకట్టించాలని చూస్తోంది. భారత్ మీద ఉగ్రవాదాన్ని ఉసిగొల్పడంలో పాక్ అనుసరిస్తున్న వైఖరిని సొంత దేశం జనాలే తిరస్కరించాలని భారత్ వ్యూహంగా ఉంది. సరే ఇదంతా బాగానే ఉన్నా వర్కౌట్ అయ్యే అవకాశాలు ఉన్నా ఇది కనుక ఒక వ్యూహంగా మరితే భారత్ కి పొరుగున ఉన్న ఎగువన ఉన్న దేశాల నుంచి సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది అని అంటున్నారు. ఉదాహరణకు బ్రహ్మపుత్ర నది ఉంది. అది చైనా నుంచి ఇండియాకు ప్రవహిస్తోంది. ఈ నది విషయంలో ఎలాంటి ఒప్పందాలు రెండు దేశాల మధ్యన లేవు. ఇక భారత్ లోని ఈశాన్య రాష్ట్రాలకు నీటి వనరుగా సాగు నీటి సదుపాయాలుగా బ్రహ్మపుత్ర ఉంది ఆ నది మీదనే ప్రపంచంలో అత్యంత ఎత్తు అయిన ఆనకట్టను చైనా నిర్మిస్తోంది. అదే సమయంలో భారత్ అభ్యంతరాలను కూడా పట్టించుకోవడం లేదు. మరి పాక్ మీద నీటి ఖడ్గం భారత్ ప్రయోగిస్తే తన దోస్తీ విషయంలో చైనా బ్రహ్మ పుత్ర అస్త్రం ప్రయోగించినా విడ్డూరం ఏమీ ఉండదని అంటున్నారు. బ్రహ్మపుత్ర నది మీద హక్కులు అన్నీ మావే అని చైనా కనుక అడ్డుకట్ట వేస్తే కనుక భారత్ లోని కీలక ప్రాంతాలూ ఇబ్బంది పాలు అవుతాయని అంటున్నారు. ఉగ్రవాదుల పీచమణచేందుకు దౌత్య నీతితో సహా అనేక అంశాలను వాడుకోవచ్చు కానీ మరీ నదుల మీద ఆంక్షలు పెట్టడం వల్ల కొత్త ఇబ్బందులు వస్తాయేమో అన్న చర్చ సాగుతోంది. అదే సమయంలో ఎరగని వారికి ఎత్తులు మప్పే విధంగా చేసినట్లు అవుతుందేమో అని కూడా అంటున్నారు.

# ఎదురయ్య భూ సమస్యలకు భూభారతి పరిష్కారం చూపించనుంది ....

## మేడ్చల్ మల్కాజి జిల్లా కలెక్టర్ గౌతమ్






జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : భూభారతి చట్టం పై జరిగిన అవగాహన సదస్సులో రైతులు తెలిపిన అన్ని సమస్యలకుఈ చట్టంలో పరిష్కరించే అవకాశం ఉందని, మీ గ్రామాలలో రెవెన్యూ అధికారులు నిర్వహించే రెవెన్యూ సదస్సులో మీరు దరఖాస్తులు ఇస్తే వాటికి శాశ్వత, సత్వర పరిష్కారం ఉంటుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం స్పష్టం చేసారు .శనివారం దుండిగల్ మండలంలోని గండిమైసమ్మ గ్రామంలో గల మేకల వెంకటయ్య ఫంక్షన్ హాలు లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ అవగాహన సదస్సులోరైతులు తెలిపిన సమస్యలకుఈ భూభారతి చట్టంలో పరష్కారం ఉంటుందని, భూభారతి పరిధిలో లేని సమస్యలకు తగు సూచనలు రెవెన్యూ అధికారులు ఇస్తారని అన్నారు. భూధాన్, ఇనాం చట్టాల ద్వారా కలిగే సమస్యల పట్ల సదస్సు ఏర్పాటు చేస్తామని రెవెన్యూ శాఖామాత్యులు చేప్పారని కలెక్టరు తెలిపారు. దాదాపు 20 నుండి 25 భూ చట్టాలు ఉన్నాయని, వాటన్నింటిని క్రోడీకరించి ఒక నూతన చట్టాన్ని తీసుకురావాలని రెవెన్యూ మంత్రి ఆలోచనలో ఉందన్నారు.

రైతులకు, ప్రజలకు ఉపయోగపడేలా అన్ని చట్టాలను కలిపి సింగిల్ రెవెన్యూ చట్టం త్వరలోనే తేవడం జరుగుతుందన్నారు. ధరణి చట్టం లోరెవెన్యూ శాఖ చేతులు కట్టేసినట్టు అయిందని,ఈ భూభారతితో రైతుల, భూస్వాముల భూ సమస్యలు తీర్చే అధికారం రెవెన్యూ అధికారులకు ఈ చట్టంలో ఇవ్వడం జరిగిందన్నారు. రెవెన్యూ, జిహెచ్ఎంసి, హెచ్ఎండిఎ, హైడ్రా అన్ని శాఖల సమన్వయంతో ఎంక్రోచ్ మెంట్ సమస్యల పై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టరు తెలిపారు. ఈ సదస్సులో మీరు అందించిన భూభారతిలో తీరని సమస్యలను, సూచనలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని కలెక్టరు సూచించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు మాట్లాడుతూ రైతులకు ఆదరాబాదర అవసరం లేదని, మీ గ్రామాలలో ఏర్పాటు చేసే రెవెన్యూ సదస్సులలో మీ సమస్యలకు అపీలు చేసుకోవచ్చని, ఆ సమస్యలను తప్పకుండా పరిష్కరి స్తామని అన్నారు. ధరణి వల్ల పిఓబి సమస్యలు చాలా ఉన్నాయని, భూభారతి చట్టంలో పిఓబి రద్దుచేసే అధికారం కల్పించడం జరిగిందన్నారు.

ఈ భూభారతి చట్టంలో ప్రతి సంవత్సరం డిసంబర్ 31న ఆ సంవత్సరంలో జరిగిన మార్పులు, చేర్పులను ఆన్ లైన్ లో ప్రింట్ తీసి ప్రతి గ్రామ పంచాయతీ నోటీసు బోర్డులలో ప్రదర్శిస్తారని అందువల్ల మీకందరికి మీమీ భూముల రికార్డుల వివరాలు తప్పక తెలుస్తాయని అదనపు కలెక్టరు వివరించారు. గ్రామ పంచాయతీ అధికారులను నియమించి ప్రతి గ్రామంలోని చిన్న చిన్న సమస్యలను పరిష్కరించడమే కాకుండా ఏవైనా భూ వివాదాలు, తగాదాలు ఉంటే వాటిని తహాసీల్దార్ల దృష్టికి తీసుకువెళతారని తెలిపారు. ఈ సదస్సులో జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నర్సింహాలు, జిల్లా గ్రంధాలయ సంస్థ కమిటీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మల్కాజిగిరి ఆర్డిఓ శ్యాంప్రకాష్, దుండిగల్ తహాసీల్దారు మతిన్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రదాడిని ఖండిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించిన గ్రామస్తులు



శామీర్ పేట, (గరుడ వార్త) : కాశ్మీర్లో యాత్రికులపై ఉగ్రదాడిని ఖండిస్తూ కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట గ్రామంలో యువకులు రామాలయం నుంచి సుభాష్ చంద్రబోస్ వరకు శనివారం రాత్రి క్యాండిల్ ర్యాలీ తీశారు. జాతీయ జెండాను పట్టుకొని తీవ్రవాదులకు, పాకిస్తాన్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాం ప్రాంతంలో యాత్రికుల పై జరిగిన ఉగ్రవాద దాడి ని తీవ్రంగా ఖండిచారు. అసువులు బాసిన యాత్రికులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని వివిధ పార్టీల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

# ఎండకు ఎండాల్సిందే



హైదరాబాద్: వేసవి సమీపిస్తున్న వేళ ఆర్టీసీ ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. అవసరమైన బస్‌షెల్టర్లు లేక ఎండలో నిరీక్షిస్తున్న పరిస్థితి. పేరుకే ఉన్న కొన్ని ఏసీ బస్‌షెల్టర్లు మందుబాబులకు అడ్డాలుగా మారిపోయాయి. మరికొన్ని చోట్ల విద్యుత్తు సరఫరా లేక పాడైన ఫ్యాన్లు, ఏసీలు దర్శనమిస్తున్నాయి. గ్రేటర్‌లో 2800కి పైగా బస్సుల్లో నిత్యం 20లక్షల మంది ప్రయాణాలు సాగిస్తుండగా 2200 బస్‌షెల్టర్లకు 1370 మాత్రమే ఉన్నాయి. 200 ప్రాంతాల్లో నిర్మించడం తప్పనిసరి అంటూ గ్రేటర్ ఆర్టీసీ అధికారులు జీహెచ్ఎంసీకి విన్నవించినా అవి కాగితాలకే పరిమితం అయ్యాయి.

**ఆరు బయటే నిరీక్షణ..**

మెహిదీపట్నంలో రైతుబజార్ వైపు ఉన్న బస్‌షెల్టర్లలో విరిగిన కుర్చీలు, బల్లలే దర్శనమిస్తున్నాయి. ఎండలోనే బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. ప్రయాణికులు ఎక్కడ బస్సు ఎక్కుతారో సర్వే చేయకుండా బస్‌షెల్టర్లు నిర్మించడంతో చాలావరకు నిరుపయోగంగా మారిపోయాయి.
హిమాయత్‌నగర్ రోడ్డు, నారాయణగూడ, కాచిగూడ, అమీర్‌పేట, కోఠి, ఉప్పల్, బీహెచ్ఈఎల్ మార్గంలో అవసరమైన చోట షెల్టర్లు లేవు. మరోవైపు హైటెక్‌సిటీ, మాదాపూర్, జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, సోమాజిగూడ ప్రాంతాల్లో అవసరానికి మించి నిర్మించారు.
లింగంపల్లి నుంచి చందానగర్ మార్గంలోనూ కొత్తగా నిర్మించాలనే డిమాండ్లు ఉన్నాయి. ఫలక్‌నుమా ఇంజిన్‌బౌలి మార్గంలో బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు, కళాశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏసీ బస్‌షెల్టర్ల పరిస్థితి.. డిజైన్ బిల్డ్ ఫైనాన్స్ ఆపరేట్ (డీబీఎఫ్‌వోటి) పద్ధతిలో ఏసీ బస్‌షెల్టర్లను ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్, కూకట్‌పల్లి, ఎస్పీరోడ్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, మలక్‌పేట్‌లోని ఏసీ బస్‌షెల్టర్లలో నిర్వహణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఇక్కడ పనిచేయని ఏసీలు, ఫ్యాన్లు దర్శనమిస్తు న్నాయి. డిజైన్‌లోపం ఉండటం, వచ్చే బస్సులు కనిపించకపోవడంతో షెల్టర్ బయటే వేచి చూస్తున్నారు. కొన్నిచోట్ల దుకాణాలకు అద్దెకిచ్చారే తప్ప నిర్వహణను పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. కూకట్‌పల్లిలో రాత్రయితే మందుబాబులు ఇందులో తిష్ఠవేస్తున్నారు.

# జన సాంద్రత.. నేర తీవ్రత

హైదరాబాద్: ఐటీ కారిడార్‌లో నేరాల సంఖ్య పెరుగుతోంది. గచ్చిబౌలి, మాదాపూర్, రాయదుర్గం పోలీస్‌స్టేషన్ల పరిధిలో నేరాలు ఎక్కువగా నమోదవుతున్నాయి. గచ్చిబౌలి ఠాణాలో జనవరి, ఫిబ్రవరిలో 336 కేసులు నమోదయ్యాయి. సగటున రోజుకు 5 రికార్డయ్యాయి. నార్సింగి ఠాణా పరిధిలో 2 నెలల్లో 389 కేసులు నమోదయ్యాయి. ఫిర్యాదులు వచ్చిన వెంటనే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం వల్లే కేసుల సంఖ్య ఎక్కువగా కనిపిస్తోందని పోలీసు అధికారులు చెబుతున్నారు. నమ్మకద్రోహం (చీటింగ్), ఆర్థిక తగాదాలు, ఉద్యోగ మోసాలు, అదృశ్యం, రోడ్డు ప్రమాదాల కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. విభజిస్తేనే తగ్గుదల గతంలో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో కేసుల సంఖ్య ఎక్కువగా ఉండేది. కొత్తగా ఫిల్మ్‌నగర్, మధురానగర్, బోరబండ ఠాణాలు రావడంతో కేసుల సంఖ్య తక్కువగా ఉంటోంది. ఐటీ కారిడార్‌లో కొత్తగా కొండాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఠాణాలను ప్రతిపాదించారు. అవి వస్తే నిఘా పెరిగి నేర నియంత్రణ సులువుగా మారుతుందని అధికారులు తెలిపారు.



జనసాంద్రత అంతర్జాతీయ, దేశీయ సంస్థలు.. భిన్న ప్రాంతాల ప్రజలు.. అత్యధిక జనసాంద్రత.. వీటితోపాటే ఆర్థిక వివాదాలు.. సైబర్ నేరాలు ఐటీ కారిడార్‌లో ఎక్కువ నేరాల నమోదుకు కారణమవుతోంది. ఇక్కడితో పోలిస్తే జగద్గిరిగుట్ట, రాజేంద్రనగర్ ఠాణాల పరిధిలో జనసాంద్రత ఎక్కువ. ఇతర రాష్ట్రాల కూలీలు ఉంటున్నారు. ఇలాంటి చోట్ల సైబర్ నేరాలు, ద్విచక్రవాహనాల చోరీలు, ఆర్థిక తగాదాలు తక్కువగా ఉంటాయి. ఐటీ కారిడార్ పరిధిలోని మూడు ఠాణాల పరిధిలో అత్యధికులు విద్యావంతులు. ఏ సమస్య వచ్చినా పోలీసులను ఆశ్రయిస్తుండటంతో ఎక్కువ కేసులు నమోదవుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. గతంలో ఫిర్యాదు దశలో రాజీ ప్రయత్నాలు జరిగేవని హైదరాబాద్ కేంద్రంగా దాదాపు 2 వేల ఐటీ సంస్థలు పనిచేస్తుంటే సుమారు 95 శాతానికి పైగా ఐటీ కారిడార్ కేంద్రంగానే నడుస్తున్నాయి. ఈ ప్రాంతంలో సుమారు 5 లక్షల మందికిపైగా ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు.

జనవరి, ఫిబ్రవరి నెలల్లో నేరాలివీ..

గచ్చిబౌలి 336 మాదాపూర్ 314 రాయదుర్గం 173 నార్సింగి 389

# తీరు మారితే.. తీరుతుంది దాహార్తి

తాండూరు, పరిగి: ప్రజల దాహార్తిని తీర్చిడానికి ప్రభుత్వం పంప్‌హౌస్‌లు, తాగునీటి ప్రాజెక్టులు చేపడుతోంది. వీటి నిర్వహణ సక్రమంగా ఉంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు. కానీ క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటించి తనిఖీలు చేపట్టక పోవడం, అవసరమైన మరమ్మతులు నిర్వహించక పోవడం తదితర కారణాలతో పథకాలు వృథాగా మారుతున్నాయి. నిదర్శనంగా నిలుస్తున్నాయి ఈ పంప్‌హౌస్‌లు.

**కాగ్నా నది ఆధారంగా రెండు ఏర్పాటు**

తాండూరు పట్టణానికి కాగ్నానది ఆధారంగా తాగునీటిని సరఫరా చేసే రెండు పంప్‌హౌస్‌లు గడచిన మూడేళ్లకు పైగా మూత పడ్డాయి. వినియోగంలోకి తీసుకు వస్తే ప్రయోజనకరంగా ఉంటుంది. పట్టణంలోని 36 వార్డుల్లో 14వేల గృహాల్లో నివాసం ఉండే 71,008 జనాభాకు నిత్యం 8.5 ఎం.ఎల్.డి (మిలియన్ లీటర్స్ పర్ డే) తాగు తాగునీరు అవసరం. కానీ 6.5 ఎం.ఎల్.డి.మాత్రమే సరఫరా అవుతోంది.



**రహదారి నిర్మాణం పేరుతో పైప్‌లైన్ తొలగింపు**

కాగ్నానది వంతెన సమీపం నుంచి కొడంగల్ నియోజకవర్గం గ్రామాలు, యాలాల మండలంలోని 39 గ్రామాలకు కలిపి తాగునీటిని సరఫరా చేయడానికి 1999లో రూ.6.50 కోట్ల వ్యయంతో నిర్మించిన పంప్‌హౌస్ తాత్కాలికంగా మూత పడింది. ఏళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్న పంప్‌హౌను గతేడాది వినియోగంలోకి తీసుకు వచ్చి నీటిని సరఫరా చేశారు. అయితే తాండూరు నుంచి కొడంగల్ వైపు నిర్మిస్తున్న జాతీయ రహదారి పనుల నేపథ్యంలో నీటి సరఫరా పైపులైన్‌ను తొలగించారు. దీంతో నీటి సరఫరా నిలిచిపోయింది. పనులను పూర్తి చేసి కొత్తగా పైప్‌లైన్ ఏర్పాటు చేస్తే పంప్‌హౌస్ వినియోగంలోకి వస్తుంది. ప్రజలకు తాగునీటి సరఫరా జరిగి ఎద్దడి సమస్య ఉండదు. ఇందుకోసం అధికారులు చర్యలు తీసుకోవాలి.

**సుదీర్ఘ కాలంగా సేవలు**

1953లో పాత తాండూరు కాగ్నానది వారగా అప్పటి ప్రజల అవసరాలను తీర్చే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన పంప్‌హౌస్ నుంచి నాలుగేళ్ల కిందటి వరకు సరిపోను నీటి సరఫరా జరిగింది. నిర్వహణ సవ్యంగా లేక పోవడంతో మరమ్మతుకు వచ్చింది. పట్టణానికి 24 గంటల పాటు నీటిని సరఫరా చేసే పంప్ ఆధారిత ఇన్‌ఫిల్టరేషన్ బావులు ఉన్నాయి. యాలాల మండలం బెన్నూరు శివారు కాగ్నానది వారగా తాండూరు పట్టణానికి నీటిని సరఫరా చేసే మరో పంప్ హౌస్‌ను 2005లో రూ.5.80 కోట్లతో నిర్మించారు. నిర్వహణ సవ్యంగా లేక నిరుపయోగమైంది. ప్రస్తుత వేసవిలో ఈ రెండు పంప్‌హౌస్‌లను వినియోగంలోకి తీసుకు వస్తే 2ఎం.ఎల్.డి. నీటి సరఫరా జరిగి ప్రజల దాహార్తి తీరుతుంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

# ఇసుకాసురులు ఇష్టారాజ్యం

జమ్మికుంట: మానేరు పరీవాహక ప్రాంతం నుంచి ఇసుక అక్రమ రవాణాకు అడ్డు లేకుండా పోతుంది. జమ్మికుంట పోలీస్ స్టేషన్ పరిధిలోనే నెలకు 20 నుంచి 30 ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొంటున్నా.. యజమానులు, డ్రైవర్లలో మార్పు రావడంలేదు. అక్రమార్కులపై కేసులు పెట్టినా దందా ఆపడంలేదు. జిల్లా ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరిస్తే తప్ప ఈ రవాణాను కట్టడి చేయలేరని పలువురు చర్చించుకుంటున్నారు.

**నిత్యం వందల ట్రాక్టర్లలో..**

మానేరు పరీవాహక ప్రాంతంలో ఇసుక సులువుగా లభించడంతో అక్రమార్కులు వ్యాపారంగా మలుచుకున్నారు. జమ్మికుంట మండలం విలాసాగర్‌లో ఇసుక రవాణాను జీవనోపాధిగా మలుచుకున్నారంటే విస్మయాన్ని కల్పిస్తుంది. ఉదయం 3 గంటల నుంచే ట్రాక్టర్లలో నింపిన ఇసుకను జమ్మికుంట మీదుగా తరలిస్తున్నారు. సెల్‌ఫోన్ల ద్వారా సమాచారాన్ని చేరవేసుకుంటూ అధికారుల కదలికలపై డ్రైవర్లు అప్రమత్తమవుతున్నారు. ఉదయం పరిమితికి మించిన వేగంతో ఇచ్చే ట్రాక్టర్లతో వాకర్స్ ఆందోళన పడుతున్నారు.

**దూరాన్ని బట్టి ధర**హుజూరాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట మండలం విలాసాగర్, తనుగుల, గంగ్రపల్లి, శంభునిపల్లి, వావిలాల, నాగారం, వీణవంక మండలం చల్లూరు, మల్లారెడ్డిపల్లి, కోర్కల్, పోతిరెడ్డిపల్లి, కొండపాక, హుజూరాబాద్ మండలం కందుగుల, చెల్పూర్‌తోపాటు తదితర ప్రాంతాల నుంచి నిత్యం 300 నుంచి 700 ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమంగా తరలిపోతుంది. ట్రాక్టర్ ఇసుకకు రూ.2,500 నుంచి రూ.5 వేల దాకా తీసుకుంటున్నారని



నిర్మాణ యజమానులు చెబుతున్నారు.

**ప్రభుత్వ నిర్మాణాల సాకు చూపి**

ప్రభుత్వ భవన నిర్మాణాలకు ఇసుకను తరలిస్తున్నట్లుగా ట్రాక్టర్లకు పలువురు ఫ్లెక్సీలు కట్టుకొని దందా సాగిస్తున్నారు. విలాసాగర్ మానేరు ప్రాంతంలో సోమవారం జమ్మికుంట తహసీల్దార్ రమేష్‌బాబు దాడులు నిర్వహించి 5 ట్రాక్టర్లను పట్టుకొన్నారు. వీణవంక మండలం మల్లారెడ్డిపల్లిలోనూ ఇదే పరిస్థితి. వావిలాల మానేరు ప్రాంతాన్ని ఇటీవల ఇరిగేషన్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు పరిశీలించారు. అక్రమ రవాణా కాకుండా చెక్ పోస్టులను ఏర్పాటు చేసి, నిఘా కఠినతరం చేస్తే దందాకు తెరపడనుందని భావిస్తున్నారు.

**నిఘా పెడుతున్నాం**

విలాసాగర్ మానేరు ప్రాంతం నుంచి అధికంగా రవాణా జరుగుతుంది. పోలీసులు, అధికారులు ప్రభుత్వం అనుమతి లేని ట్రాక్టర్లను పట్టుకొని కేసు పెట్టినా పరిస్థితిలో మార్పు రావడంలేదు. ఇటీవల విలాసాగర్ మానేరు ప్రాంతంలో సిబ్బందితో దాడులు నిర్వహించి ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నా.. మరలా రవాణా జరుగుతున్నట్లు మా దృష్టికి తీసుకువచ్చింది. క్షేత్రస్థాయి నుంచి నిఘాను కట్టుదిట్టం చేసి అరికట్టేలా చూస్తాం. రమేశ్‌బాబు తహసీల్దార్, జమ్మికుంట

# సర్కారు బడి పిలుస్తోంది

పెద్దపల్లి : శిథిలావస్థలో భవనాలు.. పెచ్చులూడుతున్న గోడలు.. అస్తవ్యస్తంగా విద్యుత్తు వ్యవస్థ.. తాగునీటి ఎద్దడి.. ఒంటికి, రెంటికి ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితి.. ఇలాంటి సమస్యలతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కష్టాలు తప్పడం లేదు. ఏటా రూ.కోట్లలో నిధులు మంజూరవుతున్నా పనుల్లో ప్రగతి కనిపించడం లేదు. ప్రస్తుత విద్యాసంవత్సరం ముగిసి వేసవి సెలవులు ఆరంభమైన నేపథ్యంలో తిరిగి తెరిచేనాటికైనా మౌలిక వసతులపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. దాదాపు ఒకటిన్నర నెలల పాటు సెలవులుండగా ఈలోగా పనులు చేపడితే విద్యార్థుల వెతలు తీరనున్నాయి.

**ఏళ్ల తరబడి అసంపూర్తిగానే..**

కాల్వశ్రీరాంపూర్ మండలం జాఫర్‌ఖాన్‌పేట ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గది నిర్మాణం మూడేళ్లుగా అసంపూర్తిగానే ఉంది. నిధులు లేకపోవడంతో పనులను వదిలేశారు.

ఓదెల మండలం పొత్కపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్ల పనులను అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద నామమాత్రంగా చేపట్టడంతో ఇబ్బందులు నెలకొన్నాయి.

పాలకుర్తి మండలం జయ్యారం జడ్పీ ఉన్నత పాఠశాలలో కిచెన్ షెడ్డు పనులు ఏడాదిగా సా..గుతున్నాయి.

జిల్లాలో 498 పాఠశాలల్లో మిషన్ భగీరథ కనెక్షన్లు ఇచ్చినట్లు అధికారులు చెబుతుండగా ఎక్కడా అందుబాటులోకి రాలేదు.

విద్యార్థులు లేకపోవడంతో 29 పాఠశాలలు తెరచుకోవడం లేదు.



సమీప ప్రాంతాల విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్నారు.

**రూ.50 కోట్లకు పైగా బకాయిలు**

జిల్లాలో నాలుగేళ్ల క్రితం 'మన ఊరు, మన బడి'లో ఎంపికైన 191 పాఠశాలల్లో పనులు చేపట్టగా చాలా చోట్ల ఇప్పటికీ పూర్తి కాలేదు. ఉపాధిహామీలో మంజూరైన మరుగుదొడ్లు, ప్రహరీ, కిచెన్ షెడ్ల పనులు చేపట్టేందుకు గుత్తేదారులు ముందుకు రావడం లేదు. ఉన్నత పాఠశాలల్లో భోజనశాలలు నిర్మించినా డ్యూయెల్ బెంచీలు సరఫరా చేయకపోవడంతో వృథాగా మారాయి. రూ.50 కోట్లకు పైగా బిల్లులు చెల్లించాల్సి ఉంది. 583 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో రూ.25 కోట్లతో పనులు అసంపూర్తిగా మిగిలాయి. రూ.15 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. సెలవుల్లో మేల్కొంటేనే విద్యార్థులకు వెతలు తీరనున్నాయి.

**ప్రాధాన్యతా పనులు చేస్తున్నాం**

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. మన ఊరు-మన బడి కింద చేపట్టిన పనులకు బిల్లులు నిలిచిపోయాయి. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో ప్రాధాన్యతా పనులు చేస్తున్నాం. మాధవి, జిల్లా విద్యాధికారి

# మొగ్గ తొడిగిన మెరుపు యోచన



హైదరాబాద్ : చాక్లెట్, పల్లి, ఐస్‌క్రీమ్ బారులు చూశాం.. తిన్నాం. ఇప్పుడు కొత్తగా చికెన్ బార్‌లు వస్తున్నాయి. పైన కవర్ తీసేసి తినడమే. రుచిలో ఏ మాత్రం తేడా ఉండదని తయారీదారులు అంటున్నారు. ఐఐసీటీ- జహీర్ మెమోరియల్ పాఠశాల మైదానంలో ఏర్పాటుచేసిన స్టార్టప్ కాన్‌క్లేవ్ హైదరాబాద్ 2025 ఈ తరహా వినూత్న ఆవిష్కరణలకు వేదికైంది. ఐఐసీటీ, సీసీఎంబీ, ఎన్‌జీఆర్ఐ సాంకేతికతలతో నెలకొల్పిన పలు అంకుర సంస్థలు తమ ఉత్పత్తులను, సేవలను ఇక్కడ ప్రదర్శించాయి.

**అరటి పల్ప్ నుంచి ప్యాడ్స్**

వ్యవసాయ వ్యర్థాల నుంచి పర్యావరణహిత ఉత్పత్తుల సాంకేతికతను ఐఐసీటీ అభివృద్ధి చేస్తే వాటిని ముంబయికి చెందిన ఆకార్ ఇన్నోవేషన్స్ ఉత్పత్తి చేస్తోంది. అరటి పల్ప్ నుంచి న్యాప్‌కిన్స్‌ను తయారు చేస్తున్నారు. హానికర రసాయనాలను విడుదల చేయవని.. సులువుగా భూమిలో కలిసిపోతాయని సంస్థ ప్రతినిధి ఉత్కర్ష్ తెలిపారు. ఆనందీ బ్రాండ్‌పేరుతో ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉన్నాయి.

**లింగాకర్షక బుట్టలతో..**

ఐఐసీటీ అభివృద్ధి చెందిన ఫెరోమోన్ సాంకేతికతను కీటకాల నుంచి పంటల సంరక్షణ, తెగుల నివారణకు వినియోగించి ప్రయోజనం పొందుతున్నారు. ఫెరోమోన్లతో లింగాకర్షక బుట్టలను ఎరవేసి కీటకాలను ఆకర్షించి బంధించడం, సింథటిక్ ఫెరోమోన్లను విడుదల చేయడంతో వాటి కలయికకు అంతరాయం కలిగించడంతో పునరుత్పత్తి తగ్గించడం ద్వారా పంటకు నష్టం కలగకుండా చేస్తుంది.

**చక్కెరకు ప్రత్యామ్నాయం..**

తీపి పదార్థాలు ఆరగిస్తే ఒంట్లోకి చాలా క్యాలరీలు చేరుతాయని భయం. మధుమేహంతో ఉన్నవారు, ఇతర అనారోగ్య సమస్యల బారిన పడకుండా ఉండేందుకు చాలామంది ముందు నుంచే తీపిని తగ్గిస్తుంటారు. ఇలాంటి వారికి స్వీట్‌స్పాట్ అనే అంకుర సంస్థ తీపి కబురు మోసుకొచ్చింది. సహజంగా పండిన వ్యవసాయ ఉత్పత్తులు పండ్లు, కూరగాయల ద్వారా తయారు చేసిన ప్రీబయాటిక్ షుగర్‌గా తయారీదారులు చెబుతున్నారు.

**భూమిలో కలిసిపోయే కవర్లు...**

180 రోజుల్లో భూమిలో కలిసిపోయేలా బయో డిగ్రేడబుల్ కవర్లను గ్రీన్‌వర్క్స్ బయోసంస్థ ఉత్పత్తి చేస్తోంది. నానో క్రిస్టలైజ్ సెల్యూలోజ్ పౌడర్ నుంచి వీటిని తయారు చేస్తున్నారు. ఈ సాంకేతికతను ఐఐసీటీ నుంచి పొందారు. చూడటానికి ప్లాస్టిక్ కవర్ మాదిరే ఉంటుంది. సుల్తాన్‌పూర్‌లోని మెడికల్ డివైజెస్ పార్క్‌లో తమ యూనిట్ ఉందని సంస్థ ప్రతినిధి శివానీ తెలిపారు. ప్లాస్టిక్ బాటిల్స్‌ను ముక్కలుగా చేసి వాటితో సంచులను తయారుచేసే పీబీఏటీ సాంకేతికతపై ఐఐసీటీ పరిశోధకులు కృషి చేస్తున్నారు.

**ప్రొటీన్ కోసం చికెన్ బార్...**

సీసీఎంబీ-అటల్ ఇంక్యుబేషన్ సెంటర్‌కి చెందిన ఇండిమీట్ అనే అంకుర సంస్థ ప్రొటీన్లు అధికంగా ఉండే చికెన్‌ను బార్‌ల రూపంలో తీసుకొస్తోంది. చెంగిచర్లలోని నేషనల్ మీట్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో ప్రయోగాత్మకంగా వీటిని తయారుచేస్తోంది. దేశవాళి మసాలా దినుసులు, మిల్లెట్స్‌ను జోడించిన ఇవి ఏడాది పాటు నిల్వ ఉంటాయని చెబుతున్నారు. **సులభంగా వైద్య నిర్ధారణ పరీక్షలు**

సికిల్ సెల్ అనిమియాను రూ.100 ఖర్చుతో ఒక రక్తపు బొట్టు పరీక్షతో సులభంగా వైద్యపరీక్షలు చేసే కిట్‌ను లైటనింగ్ లైవ్స్ అంకుర సంస్థ సీసీఎంబీ తోడ్పాటుతో అభివృద్ధి చేసింది. ఆరేడు రోజులు పట్టే పరీక్షను నాలుగు గంటల్లో చేసేలా కిట్‌ను తీసుకొచ్చినట్లు మనీశా తెలిపారు. కీళ్ల నొప్పులకు చేసే డయాగ్నస్టిక్ పరీక్షకు ఒక పరికరం అభివృద్ధి చేశారు. ఇది కండరాల నొప్పి ఎక్కడ ఉందో గుర్తించి నివేదికను అందజేస్తుంది. ప్రపంచంలోనే ఈ రకమైన పరికరం ఇదే మొదటిది. యూఎస్ఎఫ్‌డీఏ నుంచి కూడా అనుమతి లభించింది. ఆస్టియో ఆర్థరైటిస్ కేసులను తగ్గించడానికి, నివారణ, పరిస్థితిని అంచనా వేయడానికి కూడా ఉపయోగించుకోవచ్చు. సీసీఎంబీ-ఏఐసీలో ఇంక్యుబేట్ అయిన సంస్థ మాది. ఏడేళ్లుగా ఈ రంగంలో పనిచేస్తున్నామని స్టార్టప్ ల్యాబ్స్ వ్యవస్థాపకుడు సురేశ్ సుసుర్ల వివరించారు.

# వరదలొస్తేనే గుర్తొస్తాయా?



కరీంనగర్ : కరీంనగర్ నగరపాలికలో డివిజన్లు, జనాభా, ఇళ్ల సంఖ్య పెరగడం, కొత్త కాలనీల ఆవిర్భావంతో ఖాళీ స్థలాలు కనుమరుగవుతున్నాయి. మురుగు, వరదనీరు వెళ్లేందుకు స్థలాలు లేకపోవడంతో వరద కాల్వలే ప్రధానంగా మారాయి. 2001లో అప్పటి అవసరాలకు తగ్గట్లు డిజైన్ చేశారు. నగరవ్యాప్తంగా వచ్చే మురుగు, వరదనీరు ఈ కాల్వల గుండానే నగర శివారు వరకు తరలిస్తున్నారు. స్మార్ట్‌సిటీలో అంతర్గత వీధుల్లో వరద కాల్వల విస్తీర్ణం చేపట్టగా గతంలో నిర్మించిన కాల్వలపై శ్లాబులు వేసి వదిలేశారు. జ్యోతినగర్, ముకరంపుర, గణేశ్‌నగర్ బైపాసు రోడ్డు, విద్యానగర్, ఆమేర్‌నగర్‌లో ముంపునకు గురి కాకుండా చర్యలు చేపట్టారు. మిగతా ప్రాంతాల్లో గతంలో ఉన్న కాల్వలను మాత్రం పట్టించుకోలేదు.

**శిథిలమైన కాలువలు**నగరంలో పలు ప్రాంతాల్లో వరద కాల్వలు కూలిపోయాయి. అంతర్గత వీధుల్లోంచి వచ్చే వరద నీటిని పంపించేందుకు రంధ్రాలు చేసిన చోట కోతకు గురవుతున్నాయి. మంకమ్మతోట గ్రంథాలయం వెనుకాల ఉన్న డ్రైనేజీ పూర్తిగా శిథిలమైంది. అశోక్‌నగర్ అంగడి బజారు, శర్మనగర్, సాయినగర్, హుస్సేనీపుర శివారు, గణేశ్‌నగర్, కలెక్టరేట్- అంబేడ్కర్ స్టేడియం పక్కన కాపువాడలో గోడలు కూలిపోయాయి. వీటికి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయకపోవడంతో ఆ కాల్వలు మరింత చెడిపోతున్నాయి. ప్రజలు తిరుగుతున్న ప్రాంతాల్లో శ్లాబులు వేయకపోవడంతో రాకపోకలు సాగించే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

**ఇవిగో సమస్యలు..**

నగరవ్యాప్తంగా ఏటా పూడికతీత పనులు చేసేందుకు రూ.లక్షలు ఖర్చు చేస్తుండగా ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదు. క్యూబిక్ మీటర్ చొప్పున పనులు అప్పగిస్తుండటంతో పూర్తిస్థాయిలో పూడిక తొలగించడం సాధ్యం కావడం లేదు. పైపైనే పనులు చేసి చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఒక్కో కాలువలో 30 శాతం మేర మట్టి, పూడిక పేరుకుపోయింది.

రెండో ఠాణా పక్కన వరద కాలువలో పూడిక తొలగిస్తుండగా రహదారి మధ్యలో కల్వర్టు కింది భాగంలో మట్టి రాయిలా తయారైంది. గతంలో పూడిక తొలగించేందుకు యత్నించినా సాధ్యం కాలేదు. దీంతో వర్షాకాలంలో వచ్చే వరద ప్రవాహం వేగంగా ప్రవహించకపోవడంతో ఆ నీరంతా వెనక్కి వచ్చి సమీప ఇళ్లల్లోకి నీరు చేరుతోంది. ఏళ్లుగా సమస్య ఉన్నా ఎలాంటి కార్యాచరణ తీసుకోలేదు.

ప్రభుత్వాసుపత్రి వెనుకాల, మంచిర్యాల చౌరస్తాలో వరదకాలువ సరిగ్గా లేకపోవడం, పలుచోట్ల కూలిపోవడంతో వరద వెనక్కి వచ్చి కాలనీలు నీట మునుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.


హుస్సేనీపుర ప్రధాన రహదారి గుండా నుంచి వెళ్లే ప్రధాన వరదకాలువ ఇరుకుగా ఉంది. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరదనీరు కాలువల గుండా ప్రవహించకపోవడంతో నీరంతా రోడ్లపై ప్రవహిస్తోంది. స్మార్ట్‌సిటీలో డ్రైనేజీ విస్తరిస్తామని ప్రణాళికలు చేసినా నిధుల కొరతతో ఆ పనులు చేయకుండానే వదిలేశారు.

# గురుకులం ..ఫలితాల్లో ఆదర్శం

మల్యాల: పరీక్షల ఫలితాల్లో రాష్ట్ర స్థాయి అత్యుత్తమ మార్కులు సాధించి ఆదర్శంగా నిలుస్తోంది మల్యాల మండలంలోని తాటిపల్లి గురుకుల(బాలికల) పాఠశాల, కళాశాల. వెలువడిన ఇంటర్ ఫలితాల్లో గురుకుల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి మార్కులు సాధించారు. దాదాపు 45 ఏళ్ల కిందట కాకతీయ కాలువ నిర్మాణ సమయంలో 25 ఎకరాల విస్తీర్ణంలో ఎస్సారెస్పీ అధికారులు, సిబ్బంది కోసం నిర్మించిన షెడ్లలో గురుకుల పాఠశాలను ప్రారంభించారు. 2018లో గురుకుల పాఠశాలను ప్రభుత్వం కళాశాలగా అప్‌గ్రేడ్ చేసింది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ ఫలితాల్లో శతశాతం ఫలితాలు సాధించడంతోపాటు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధిస్తున్నారు.

గురుకులంలో నిత్యం ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుంటారు. ఆయా సబ్జెక్టుల్లో సందేహాలను నివృత్తి చేస్తుంటారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే వివిధ క్రీడాపోటీల్లో గురుకుల విద్యార్థినులు ప్రతిభ చూపుతుంటారు. మంగళవారం ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో వొడ్నాల అక్షర, ఆకునూరి మీనాక్షి బైపీసీలో 995 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు సాధించారు. రాష్ట్రంలోని 35 గురుకుల కళాశాలల్లో తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాల ఏటా ఇంటర్ ఫలితాల్లో అగ్రస్థానంలో నిలుస్తోంది.

కళాశాలలో ఆంగ్లం బోధనకు మాత్రమే రెగ్యులర్ అధ్యాపకులు ఉండగా గణితం, ఫిజిక్స్, బాటనీ, జువాలజీ, సంస్కృతం, కెమిస్ట్రీ బోధించేందుకు ఆరుగురు గెస్ట్ అధ్యాపకులు పనిచేస్తున్నారు. దాదాపు అయిదేళ్ల కిందట పాఠశాల ఆవరణలో ఇంటర్ విద్యార్థుల కోసం ప్రత్యేక డార్మిటరీ, వసతి భవనాలు నిర్మించారు. డార్మిటరీ



హాళ్లు, మంచాల కొరత ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. అధ్యాపకులు, సిబ్బంది ప్రతి రోజు ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు అందుబాటులో ఉంటూ ప్రత్యేక బోధన చేసినట్లు ప్రిన్సిపల్ మానస తెలిపారు. జనవరి నుంచి ప్రతి రోజు ఒక సబ్జెక్టుపై ఇంటెన్సివ్ పరీక్ష నిర్వహించి ఏ ప్రశ్నకు పూర్తిస్థాయిలో సరైన సమాధానం రాయడంలేదో గుర్తించి ఆ విద్యార్థి సదరు పాఠ్యాంశంపై పట్టుసాధించేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. కళాశాలలో 170 మంది పరీక్ష రాస్తే 168 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు.

# ఏటా హరిత లక్ష్యం సంరక్షణలో నిర్లక్ష్యం

సారంగాపూర్ : ఏటా లక్ష్యాన్ని నిర్దేశించుకొని మొక్కలు నాటడంలో చూపుతున్న శ్రద్ధ.. సంరక్షణలో మాత్రం చూపకపోవడంతో రూ.లక్షల్లో ప్రజాధనం వృథా అవుతోంది. జిల్లాలోని 380 పంచాయతీల్లో 37.44 లక్షలు(2025-26) నాటేందుకు లక్ష్యాన్ని నిర్దేశించారు. కొన్నేళ్లుగా జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా దాదాపు 27,972 ప్రాంతాల్లో సుమారు మూడు కోట్ల మొక్కలు నాటినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఏటా లక్ష్యం నిర్దేశించడంతో స్థలాలు లేకపోవడంతో నాటిన ప్రాంతాల్లోనే మళ్లీ నాటాల్సి వస్తోంది. కొన్ని నర్సరీలలో మొక్కలు అలాగే ఉండిపోయి ఏపుగా పెరిగి వృక్షాలుగా మారుతుండగా వాటిని తొలగించి మళ్లీ మొక్కల పెంపకం చేపట్టాల్సి వస్తోంది. నాటేందుకు లక్ష్యం విధించకుండా నాటిన మొక్కలను సంరక్షించినప్పుడే వన మహోత్సవం విజయవంతం కానుంది.

**ప్రజాధనం వృథా**

నర్సరీలలో మొక్కల కోసం విత్తనాలు విత్తినప్పటి నుంచి పెంపకం వరకు నిర్లక్ష్యం కనిపిస్తోంది. నర్సరీలలో అవసరమైన మొక్కలు పెంచకపోవడంతో పక్కన పడేయాల్సి వస్తోంది. నిబంధనలకు అనుగుణంగా కూలీలు గుంతలు తవ్వినప్పుడే మొక్క ఎదుగుదల ఉంటుంది. పర్యవేక్షణ లేకపోవడంతో ఉపాధి సిబ్బంది గుంతలను ఇష్టానుసారంగా తవ్వుతున్నారు. కమ్యూనిటీ, ప్లాంటేషన్, హరిత వనాలలో గుంతను 0.45 సెం.మీ. లోతు, వెడల్పు ఉండాలి.



రహదారుల వెంట 2 ఫీట్లు(0.6 సెం.మీ) గుంత తప్పకుండా తవ్వాలి. కూలీ ఒక గుంత తవ్వినందుకు రూ.23, మొక్క నాటినందుకు రూ.15 చెల్లిస్తున్నారు. ఇంత మొత్తం వ్యయం చేసినా నిబంధనలకు అనుగుణంగా ఉండడంలేదన్న విమర్శలున్నాయి. ఏటా విద్యుత్తు తీగల కింద మొక్కల నాటడంతో ఎదిగిన మొక్కలను తొలగిస్తున్నారు. మళ్లీ అదే ప్రాంతంలో నాటడంతో ప్రజాధనం వృథా అవుతోంది.

**కోతుల ఆహార ప్రాంగణాలు ఎక్కడ..?**

గతంలో కోతుల కోసం ఆహార ప్రాంగణాలు, పల్లె ప్రజలకు ఆహ్లాద వాతావరణం కోసం పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. పల్లె ప్రకృతి వనాలు, రహదారుల వెంట ఉన్న మొక్కలు కనిపిస్తున్నా.. మిగతా హరిత వనాలు, కోతుల ఆహార ప్రాంగణాలు ఎక్కడా కనపడకుండా పోయాయి. పంచాయతీల్లోని నర్సరీల్లో మొక్కల పెంపకం ప్రక్రియ కొనసాగుతోంది. ప్రతి ఇంటికి అయిదు మొక్కల చొప్పున లక్ష్యం కోసం అందిస్తున్నారే తప్పా.. వారికి అవసరమైన మొక్కలను అందించకపోవడంతో తీసుకున్న వెంటనే పక్కన పడేస్తున్నారు. ఇంటి ఆవరణలో స్థలం లేనప్పటికీ మొక్కలు అందించడంతో వృథా అవుతున్నాయన్న ఆరోపణలున్నాయి.

# మహిళ సంఘాలకు భరోసా

మెట్‌పల్లి : మహిళా సంఘాల అభ్యున్నతికి గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం కృషి చేస్తోంది. సంఘాల్లోని సభ్యులకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తోంది. ఇది వరకే రూ.కోట్ల రుణాలు పొందిన మహిళా సంఘాల సభ్యులు వివిధ వ్యాపారాల్లో రాణిస్తున్నారు. వారిలో వ్యాపార నైపుణ్యాన్ని పెంపొందించి ఆర్థికాభివృద్ధి సాధించడానికి మరింత భరోసా కలిగేలా సెర్ప్, జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్(ఎన్ఆర్ఎల్ఎం) ద్వారా స్టాండర్డ్ విలేజ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్(స్వెప్) కార్యక్రమం అమలుకు జిల్లాలో మూడు మండలాలను ఎంపిక చేశారు.

రుణాలు పొందిన స్వయం సహాయక సంఘాల మహిళలు వివిధ ఉపాధి అవకాశాలను ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదగాలనేది ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం. కిరాణం, టైలరింగ్, బ్యూటీపార్లర్, దుస్తుల విక్రయ కేంద్రం, పిండి గిర్ని, పాడి పశువుల పెంపకం తదితర జీవనోపాధికి అవసరమైన యూనిట్లను మహిళలు ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాకుండా మహిళా శక్తి కింద క్యాంటీన్లు, ఇతర సూక్ష్మ పరిశ్రమలు నెలకొల్పుతున్నారు. వ్యాపారాలను విస్తృతపర్చడంలో అనుకున్నంత ముందంజ వేయలేకపోతుండడంతో గ్రామీణ మహిళల ఆర్థిక స్థితిగతుల్లో మార్పు కనిపించడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో వ్యాపార రంగంలో మహిళలకు మరింత నైపుణ్యం, మార్కెటింగ్ మెలకువలపై అవగాహన పెంపొందించి ఆర్థికాభివృద్ధి చెందేలా ఎన్ఆర్ఎల్ఎం ద్వారా స్వెప్ కార్యక్రమం అమలు చేయడానికి నిర్ణయించారు. జిల్లాలో మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, కోరుట్ల మండలాలను ఎంపిక చేసి బ్లాక్‌గా ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో



స్వెప్ కార్యక్రమం అమలు చేస్తూ మహిళలకు సేవలందించేందుకు క్లస్టర్ రిసోర్స్ పర్సన్ ఎంటర్‌ప్రెన్యూర్(సీఆర్పీ ఈపీ)ల నియామకానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల మెట్‌పల్లిలో వీరి ఎంపికకు అవసరమైన గ్రూప్ యాక్టివిటీ, చర్చ, పరీక్షలను నిర్వహించారు.

**ఆర్థిక ఎదుగుదలకు తోడ్పాటు**

మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, కోరుట్ల మండలాల బ్లాక్‌లో 25 మంది సీఆర్పీ ఈపీలను నియమించనున్నట్లు తెలుస్తోంది. ఎన్ఆర్ఎల్ఎం ద్వారా సీఆర్పీ ఈపీలు మహిళల ఆర్థిక ఎదుగుదలకు పని చేయాల్సి ఉంటుంది. మహిళలు ఇప్పటికే ఏర్పాటు చేసుకున్న, కొత్తగా ఏర్పాటు చేసే సూక్ష్మ పరిశ్రమలను విస్తృతపర్చడం, వ్యాపార నిర్వహణపై అవగాహన పెంపొందించి అవసరమైన రుణాలు ఇప్పించి సాంకేతిక సహకారం అందించాల్సి ఉంటుంది. మొదట మూడు మండలాలను ఎంపిక చేసి కార్యక్రమం అమలు చేసి మహిళా సంఘాల సభ్యుల ఆదాయాభివృద్ధికి తోడ్పాటునందించే దిశగా అడుగులు వేస్తున్నారు.

# ప్రతి నీటి చుక్కనూ పట్టేస్తుంది

హైదరాబాద్: నీటి వృథాను అరికట్టేందుకు, మీటర్ రీడింగ్‌ను పక్కాగా లెక్కపెట్టేందుకు ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లోని స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్ పరిశోధకులు వినూత్న పరికరాన్ని ఆవిష్కరించారు. మన ఇంట్లో జలమండలి అధికారులు ఏర్పాటు చేసే మీటర్‌పైన దీన్ని అమర్చితే చాలు.. మీటర్ రీడింగ్‌ను కెమెరాతో చిత్రీకరిస్తుంది. వై-ఫై పరిజ్ఞానంతో ఇంట్లో ఏర్పాటు చేసిన సర్వర్‌కు సమాచారం పంపుతుంది. ఎన్ని కిలోలీటర్ల నీళ్లు వినియోగించామో తెలుపుతుంది. ఈ పరికరానికున్న సెన్సర్లు నీటి సంపులో ఉన్న నీటి పరిమాణాన్ని చెబుతాయి. రెండేళ్లపాటు పరిశోధించి 'అనలాగ్ మీటర్ రాస్ప్‌బెర్రీ పై కెమెరా' పరికరాన్ని కనుగొన్నామని స్మార్ట్‌సిటీ లివింగ్ ల్యాబ్ చీఫ్ అర్కిటెక్టర్ వి.అనురాధ తెలిపారు. ఒక పరికరం తయారీకి రూ.5వేలు ఖర్చయ్యిందని వందలు, వేలల్లో తయారు చేస్తే ఖర్చు తగ్గుతుందని వివరించారు.ఎందుకు కనుగొన్నారంటే.. ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో సంపుల వద్ద జలమండలి సిబ్బంది అనలాగ్ మీటర్లను



బిగించారు. నెలనెలా వచ్చి మీటర్ రీడింగ్‌లను చూసి బిల్లులు వేస్తుండేవారు. మీటర్ రీడింగ్ ఆగిపోయినా వీరికి తెలిసేది కాదు. స్మార్ట్‌సిటీ లివింగ్‌ల్యాబ్ ఆచార్యులు, విద్యార్థులు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ద్వారా 'రాస్ప్‌బెర్రీ పై కెమెరా'తో కూడిన అనలాగ్ మీటర్ కెమెరాను రూపొందించారు. వివిధ దశల్లో ప్రయోగాలు చేసి.. తొలుత క్యాంపస్‌లోని రెండు సంపుల్లో పరికరాన్ని అమర్చి రీడింగ్‌ను పరిశీలించారు. ఫలితాలు సంతృప్తికరంగా రావడంతో క్యాంపస్‌లోని సంపుల్లో మీటర్లకు అమర్చారు.

**వృథా అరికడుతుందిలా..**

రాస్ప్‌బెర్రీ పై కెమెరా ద్వారా ప్రతినీటి చుక్కకూ లెక్క ఉంటుంది. ఫలానా బ్లాక్‌లో నీటిని ఎక్కువగా వాడుకుంటున్నారని అప్రమత్తం చేస్తుంది. లీకేజీలుంటే వెంటనే సందేశాలను పంపుతుంది. రోజువారీ నీటి వినియోగాన్ని విశ్లేషించి నిర్ణీత షెడ్యూళ్లలో రిపోర్టులను పంపుతుంది. జలమండలి అధికారుల అభ్యర్థన మేరకు గచ్చిబౌలిలోని ఒక కాలనీలో కొన్ని అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాలకు అనలాగ్ రాస్ప్‌బెర్రీ పై మీటర్లను అమర్చి ఈ కెమెరాల పనితీరు, నీటి వినియోగాన్ని పరిశీలిస్తున్నారు. ఇక్కడ కూడా సంతృప్తికరంగా ఫలితాలొస్తున్నాయని స్మార్ట్‌సిటీ లివింగ్ ల్యాబ్ ప్రతినిధులు వివరించారు.

# తాగునీటి తండ్లాట

వీర్నపల్లి: వేసవి నేపథ్యంలో పల్లెల్లో తీవ్ర నీటి ఎద్దడి తలెత్తుతోంది. నీటి కటకటతో పంటలు ఎండిపోగా ప్రస్తుతం ప్రజల వంతయ్యింది. గ్రామాల్లో అద్దెబోర్ల వద్ద మహిళలు బారులు తీరుతుండగా.. బుక్కెడు నీటి కోసం గట్ల వెంబడి పరిగెత్తాల్సిన దుస్థితి తండాల్లో నెలకొంది. ముందస్తు చర్యల్లో వైఫల్యం కారణంగా సమస్య జఠిలమైంది.

**ఇబ్బందులు ఎందుకంటే..**

గ్రామాల్లో మిషన్ భగీరథతోపాటు బోరుబావుల ద్వారా రక్షిత మంచినీరు సరఫరాల చేస్తున్నారు. వేసవి ప్రారంభం నుంచి పల్లెల్లో తాగు నీటి సమస్య తీవ్రమవుతోంది. మిషన్ భగీరథ నీరు సరిపడా రావడం లేదని గ్రామ పంచాయతీ సిబ్బంది చెబుతున్నారు. వ్యవసాయానికి విరివిగా భూగర్భ జలాలు వినియాగంతో పంచాయతీల్లో బోర్లు ఎండుముఖం పట్టాయి. ఫలితంగా నీటి సరఫరాలో అంతరాయం కలుగుతోంది. జిల్లాలో చాలాచోట్ల ఇదే పరిస్థితి ఉన్నా.. వీర్నపల్లి, మద్దిమల్లతండా, మద్దిమల్ల, బంజేరు, భూక్యతండా, బావుసింగ్ నాయక్‌తండాల్లో సమస్య తీవ్రంగా ఉంది.



**సవాలుగా సమస్య**

గతంలో వేసిన బోర్లు సుమారు 300 నుంచి 500 ఫీట్ల వరకే ఉన్నాయి. అందులో జలాలు ఎండిపోవడంతో గ్రామాల్లోని జల బండాగారాల్లోకి నీటిని నింపడం సవాలుగా మారింది. అంతంత మాత్రంగానే పోస్తున్న భగీరథ జలాలు అవసరాలకు సరిపోవడం లేదు. దీంతో చాలా గ్రామాల్లో నీటి సరఫరా రెండు, మూడు రోజులకు ఒకసారి జరుగుతుంది. ప్రత్యామ్నాయంగా అద్దె బోర్లను చూసినప్పటికీ ప్రస్తుతం జలాలు అందకపోవడంతో అవికూడా సరిగా నీరు పోయడం లేదు. తండాల్లో గిరిజన మహిళలు పంట పొలాల్లోని బోరు బావుల ద్వారా నీటిని తెచ్చుకుంటున్నారు.

సమాధానం కరవు- గుగులోతు పద్మ, గోన్యానాయక్‌తండా

మా తండాకు నీటి సమస్య తీవ్రంగా ఉంది. ఇదేంటని అధికారులను ఎన్నిసార్లు ప్రశ్నించినా సరైన సమాధానమే లేదు. పని మానుకొని 12 కుటుంబాలకు చెందిన మహిళలం 400 మీటర్ల దూరంలో పెద్దవాగు ఒడ్డున బోరుబావి ద్వారా తెచ్చుకుంటున్నాం.

బిందె నీళ్లు రావడం లేదు - పిట్ల లక్ష్మి, సుభాష్‌నగర్, వీర్నపల్లి

నాలుగు నెలల నుంచి మా కాలనీకి తీవ్రమైన నీటి సమస్య ఉంది. ధర్నా చేస్తే ఆ ఒక్క రోజే నీళ్లు ఇస్తున్నారు. అధికారులు మొక్కుబడి చర్యలు చేపట్టి చేతులు దులుపుకొంటున్నారు. నాలుగు రోజులకోసారి నల్లా వస్తున్నా ఒక్క బిందె నిండడం లేదు.

# 3.5 లక్షల దరఖాస్తులు..300 లోపు పరిష్కారం



హైదరాబాద్: హెచ్‌ఎండీఏ పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ నత్తను తలపిస్తోంది. ఏడు జిల్లాలు ఆరు జోన్ల పరిధిలో 3.5 లక్షల దరఖాస్తులు రాగా.. ఇందులో ఇప్పటివరకు 300 దరఖాస్తులలోపే పరిష్కరించి ప్రొసీడింగ్స్ జారీ చేసినట్లు తెలుస్తోంది. మార్చి 31వ తేదీలోపు ఫీజు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ ఇవ్వనుండటంతో చాలామంది ముందుకు వస్తున్నారు. ప్రక్రియ వేగంగా సాగకపోవడంతో వెనక్కి తగ్గుతున్నారు. సాంకేతిక సమస్యలు పెద్ద అడ్డంకిగా మారుతున్నాయని హెచ్‌ఎండీఏ సిబ్బందే చెబుతున్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌తో భారీ ఆదాయం సమకూరుతుందని భావించిన అధికారులకు నిరాశే ఎదురవుతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం ఎల్‌ఆర్‌ఎస్‌పై ప్రభావం పడుతోంది. ముఖ్యంగా డైరెక్టర్లు, పీవోలు సరైన శ్రద్ధ చూపడం లేదనే విమర్శలున్నాయి. క్షేత్రస్థాయిలో సమీక్ష కూడా జరగడం లేదు.

ఎల్‌ఆర్‌ఎస్, వివిధ సమస్యలపై వస్తున్న దరఖాస్తుదారులను హెల్ప్ డెస్క్ నుంచి అధికారుల వద్దకు పంపుతున్నారు. అయితే అక్కడ ఎవరూ కలవడం లేదని వారు వాపోతున్నారు. దీంతో రూ.లక్షలు ఫీజులు చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. కొందరైతే తర్వాత చూద్దాంలే అని విరమించుకుంటున్నారు. ఇప్పటివరకు 5 శాతం మంది కూడా ఫీజులు చెల్లించలేదని ఓ అధికారి తెలిపారు.

**స్పష్టత ఎక్కడ?**

ఫీజు చెల్లించిన తర్వాత ఎప్పటిలోగా ప్రొసీడింగ్స్ ఇస్తారో అధికారులు చెప్పలేకపోతున్నారు. ఫలితంగా చాలామంది ముందుకు రావడం లేదు. కొన్ని ప్రాంతాల్లో ఒకే సర్వే నంబరు, పక్కపక్కనే ఉన్న ప్లాట్లకు సంబంధించి వేర్వేరుగా ప్రభుత్వ మార్కెట్ ధరలు ఉంటున్నాయి. ఒక చోట చదరపు గజం రూ.300 ఉంటే.. పక్కనే ఉన్న ప్లాటు చదరపు గజానికి రూ.15-20 వేలు చూపుతుండటంతో అవాక్కవుతున్నారు. మార్కెట్ ధర భారీగా ఉంటే...వాటిపై చెల్లించే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులు ఎక్కువగా ఉంటాయి. దీంతో డబ్బులు కట్టడానికి సిద్ధపడటం లేదు. ఆరా తీస్తే...సాంకేతిక సమస్యలే ఇందుకు కారణమని అధికారులు చెబుతున్నారు. వాటిని సరిచేసే ప్రయత్నం చేయడం లేదు. కొన్ని దరఖాస్తులకు ఎల్-1 పెండింగ్ అని చూపుతున్నారు. క్షేత్రస్థాయిలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పరిశీలించి అక్కడ ఎలాంటి నీటి వనరులు లేవని తేల్చిన తర్వాతే ఎల్-1కు క్లియరెన్సు వస్తుంది. ఇప్పటికే దరఖాస్తులను రెవెన్యూ, ఇరిగేషన్‌కు పంపినా అక్కడ పట్టించుకునే నాథుడు ఉండటం లేదు. మాస్టర్‌ప్లాన్‌లో తప్పుల వల్ల మరికొన్ని దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టారు.

# స్వచ్ఛత మరిచె.. మురుగు నిలిచె



పరిగి : జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో పాలక వర్గం గత జనవరిలో ముగిసింది. ప్రత్యేక అధికారుల పాలన కొనసాగిస్తుండగా పర్యవేక్షణ లోపం, సిబ్బంది కొరత తదితర కారణాలతో పారిశుద్ధ్య పనులు సక్రమంగా సాగడంలేదు. దీంతో చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోతోంది. తడి, పొడి చెత్త వేరుచేయడం లేదు. మురుగు కాలువలు పొంగి పొర్లుతున్నాయి. స్వచ్ఛత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. వివిధ పథకాలను అమలు చేస్తున్నాయి. పారిశుద్ధ్య పరిస్థితులు అధ్వానంగా ఉంటే స్వచ్ఛతో ర్యాంకు ఎలా సాధించగలమని పౌరులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో 'పరిశీలన' కథనం

**దశాబ్దాలనాటి కాలువలే నేటికీ దిక్కు**

వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేకించి వార్డు అధికారులను నియమించింది. కానీ వారు కార్యాలయ పనులకే పరిమితం కావడంతో పారిశుద్ధ్య పరిస్థితులు మరింత దిగజారుతున్నాయి. ఓవైపు రోజు రోజుకు జనాభా పెరుగుతున్నా అన్ని మున్సిపాలిటీల్లో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన మురుగు కాల్వలే నేటికీ ఆధారంగా నిలిచాయి. దీంతో చాలా చోట్ల మురుగు నిలిచి పోతోంది. పరిగిలో ప్రధానంగా డంపింగ్ యార్డు లేకపోవడంతో పట్టణ కేంద్రానికి సమీపంలో ఖాళీగా ఉన్న స్థలాల్లో పారబోస్తున్నారు.

**పేరుకే జిల్లా కేంద్రం**

వికారాబాద్ పట్టణ కేంద్రంలో నిత్యం అధికారులు, ప్రజా ప్రతినిధులు తిరుగుతుంటారు. అలాంటిది రోడ్ల వెంబడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పడి ఉంటున్నా సిబ్బంది తొలగించడంలేదనే విమర్శలున్నాయి. సగం సిబ్బంది లేకపోగా ఉన్న వారిలో కొందరు ఇతర విభాగాల్లో పని చేస్తున్నారు. జిల్లా కేంద్రంగా ఏర్పడినప్పటికీ కార్మికులు తక్కువగానే ఉన్నారు. **డంపింగ్ యార్డు సమస్యతో ఇబ్బంది**

మున్సిపల్‌లోని గాంధీనగర్ కాలనీకి సమీపంలో చించోళి,భూత్పూర్ జాతీయ రహదారి పక్కనే చెత్తదిబ్బ ఉండటంతో తడి,పొడి చెత్తను కలిపి వేస్తున్నారు.ఇక్కడున్న రెండు వసతి గృహాలతో పాటు గాంధీనగర్, ఆర్యనగర్ కాలనీల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు.

**వార్డుల్లో వీధులు అపరిశుభ్రం**

తాండూరు పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారి వార్డుల్లో వీధులు అపరిశుభ్రతకు నిలయంగా మారుతున్నాయి. చెత్త తరలించేందుకు తెచ్చిన వాహనాలు కొన్ని పనిచేయడంలేదు. మురుగు కాల్వలు చెత్తతో నిండిపోతున్నాయి.

# పేరుకే చెట్టు.. పర్యావరణానికి చేటు



వికారాబాద్: పర్యావరణ రక్షణ, వాతావరణ సమతుల్యతలో వృక్షాల పాత్ర వెలకట్టలేనిది. ప్రభుత్వం సైతం హరితహారం పేరిట యేటా పెద్ద ఎత్తున మొక్కలు నాటి సంరక్షించే కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ క్రమంలో వికారాబాద్, తాండూర్, పరిగి, కొడంగల్ పురపాలికల్లో కూడా 'కోనో కార్పస్' మొక్కలు నాటారు. కానీ పక్షులు వాలని, పశువులు తినని వృక్షాలుగా వీటికి గుర్తింపు ఉండటం ఆందోళనకరం. పర్యావరణానికి హాని కలిగించే వీటిని రాష్ట్ర వ్యాప్తంగా తొలగించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మంగళవారం జరిగిన శాసనసభలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.

**జిల్లా వ్యాప్తంగా 8 లక్షలు**

హరిత హారంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 8 లక్షల కోనో కార్పస్ మొక్కలను పార్కులు, రహదారుల వెంబడి, ఖాళీ ప్రదేశాలు, చెరువు గట్లు తదితర ప్రాంతాల్లో నాటారు. అన్ని పట్టణాలు, ప్రైవేటు వెంచర్లు, పెట్రోల్ బంకులు, గ్రామాల్లో, గృహ సముదాయాల్లో ప్రస్తుతం పెరిగి పెద్దవై భారీ వృక్షాలను తలపిస్తున్నాయి.

**నిపుణులు ఏం చెబుతున్నారంటే..**

తక్కువ సమయంలో ఎక్కువ ఎత్తులో ఏపుగా కోనో కార్పస్ మొక్కలు పెరుగుతాయి. వీటివల్ల జరిగే నష్టం తెలుసుకుని విదేశాల్లో నిషేధించారు.

కోనో కార్పస్ వృక్షాల పుప్పొడి అత్యంత ప్రమాదకరమైంది. కరోనా సోకిన వ్యక్తి శ్వాసకోశ సమస్యలతో ఎలా ఇబ్బందులు పడతారో ఈ చెట్ల నుంచి పీల్చుకునే గాలి వల్ల అంతటి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది.

80 మీటర్ల లోతు వరకు వీటి వేర్లు వ్యాపించి భూగర్భ జలాలను పీల్చేస్తాయి.

జంతువుల మేతకూ ఉపయోగపడవు

కోనో కార్పస్ మొక్కలపై పక్షి వాలదు, జంతువుల మేతకూ ఉపయోగపడవు. ప్రజలకు లేని జబ్బులు తెచ్చి పెడతాయి. వీటిని ఎక్కడ ఉన్నా వెంటనే తొలగించాలని ప్రభుత్వాన్ని కోరాను.

గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనసభాపతి

**నాటడం నిలిపివేశాం..**

కోనో కార్పస్ మొక్కలు పర్యావరణానికి హాని కలిగిస్తాయని తెలిసిన తరువాత జిల్లాలో వాటిని నాటడం నిలిపి వేశాం. పట్టణాల్లో పలు చోట్ల ఈ చెట్లను తొలగించి, వీటి స్థానంలో వేరే మొక్కలను నాటుతున్నాం. జ్ఞానేశ్వర్, జిల్లా అటవీశాఖాధికారి

# ఉపాధిలో.. ప్రథమం

వికారాబాద్ : వలసలు నివారించి పల్లెల్లో నివసిస్తున్న ప్రజలకు పనులు కల్పించి వారికి ఉపాధి చూపించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకం అమలు చేస్తోంది. దీన్లో భాగంగా జిల్లా ముమ్మరంగా కూలీలకు పనులు కల్పించి ప్రథమంగా నిలవడంతో ప్రత్యేక గుర్తింపు సాధించింది. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.ఇతర ప్రాంతాలకు ఆగిపోయిన వలసలు : జిల్లాలోని పరిగి, కుల్కచర్ల, దోమ, మోమిన్‌పేట, తదితర మండలాలకు చెందిన గ్రామీణులు ప్రతిసారి ఉపాధి కోసం ముంబయి, హైదరాబాద్, కర్ణాటక, మహారాష్ట్రలోని పట్టణాలకు వెళ్తుంటారు. ఉపాధి హామీ పథకం ప్రారంభించటంతో కూలీలు దీనివైపు మొగ్గుచూపారు. పనుల



కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లటం తగ్గించారు. ఈ ఆర్థిక సంవత్సరం గ్రామీణ అభివృద్ధి శాఖ దశల వారీగా 1.90 లక్షల మంది కూలీలకు పనులు కల్పించి రాష్ట్రంలోనే ప్రథమంగా నిలిచింది.

ఇకముందూ కొనసాగిస్తాం: శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

ఉపాధి హామీ పథకం పనుల అమలులో అనేక సూచికల్లో జిల్లా ప్రథమ స్థానం దక్కింది. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు, సిబ్బంది ఎంతో సమన్వయంతో పనిచేశారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తాం.

ఈ సూచికల్లో గుర్తింపు2024-25లో 1,08,480 కుటుంబాలకు, 1,90,091మంది కూలీలకు దాదాపు 63.66 లక్షల పనిదినాలు కల్పించారు. 6,581 కుటుంబాలకు 100 రోజుల పనికల్పించి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచారు. 100రోజులకు సగటుగా 59 పనిదినాలు కల్పించడంతో మొదటి స్థానం దక్కింది.ప్రస్తుతం పని చేస్తున్న కూలీలు: (ఈనెల 22 నాటికి)28,824మంది.

# లక్ష్యానికి చేరువగా పంచాయతీలు

కోరుట్ల: జిల్లాలోని గ్రామపంచాయతీలు ఆస్తి పన్ను బకాయిల వసూళ్లలో దూసుకుపోతున్నాయి. మొత్తం గ్రామాల్లో శతశాతం తప్పనిసరిగా వసూలు చేయాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించడంతో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టారు. రోజూ పన్ను బకాయిదారుల ఇళ్లకు వెళ్లి పూర్తిస్థాయిలో కట్టించే ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 20 మండలాలు.. 385 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇప్పటివరకు జగిత్యాల మండలంలో అత్యధికంగా 101 శాతం పన్నులు వసూలు చేశారు. అత్యల్పంగా కొడిమ్యాల మండలంలో 93 శాతం వసూలయ్యాయి. జిల్లా మొత్తం కలిపి 97 శాతం వసూలు చేశారు. వారం రోజులు గడువు ఉండటంతో వంద శాతం పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.



**కనిపించని అభివృద్ధి పనుల జాడ**

గ్రామపంచాయతీ పాలకవర్గాల గడువు 2024 జనవరి 31తో ముగియగా.. అప్పటి నుంచి గ్రామాల్లో నిధుల లేమితో అభివృద్ధి కుంటుపడటంతోపాటు మౌలిక వసతుల కల్పన కష్టంగా మారింది. గతంలో కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం, రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎఫ్‌సీ నిధులు కేటాయించేవి. వీటితోపాటు ఎమ్మెల్యే, ఎంపీ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేవారు. అయితే పంచాయతీ పాలకవర్గ సభ్యుల పదవీకాలం గడువు తీరడంతో ఏడాదికిపైగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రావడం లేదు. ఇంటి కుళాయి పన్నులు, ఇతర లైసెన్స్ ఫీజుల ద్వారా వచ్చే చాలిచాలనీ నిధులతోనే గ్రామాల్లో పారిశుద్ధ్యం, వీధిదీపాల ఏర్పాటు, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ట్రాక్టర్‌లలో డీజిల్ తదితర పనులు చేపడుతున్నారు. ఆయా నిధులనే మౌలిక వసతుల కల్పనకు ఉపయోగించుకుంటున్నారు. ఈ నిధులు సరిపోకపోవడంతో కొన్ని పంచాయతీల అధికారులు అప్పులు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కొన్నిచోట్ల ఏడాదికాలంగా అభివృద్ధి పనుల జాడ కనిపించకుండా పోయింది.

# పురం.. స్వచ్ఛత ప్రశ్నార్థకం!

సంగారెడ్డి : జిల్లాలోని పలు పురాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. చెత్త సేకరణలో నిత్యం నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డంప్ యార్డులు నిరుపయోగంగా మారడంతో చెత్త పేరుకుపోతోంది. స్వచ్ఛ పట్టణాలుగా మార్చాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. బొల్లారం, ఖేడ్‌లో మాత్రమే మెరుగ్గా ఉంది. **అందరూ పొరుగుసేవల సిబ్బందే..**

ఖేడ్ పుర పరిధిలో పారిశుద్ధ్య విభాగం అధికారితోపాటు మరో 42 మంది కార్మికులున్నారు. అందరూ పొరుగు సేవల కిందే పనిచేస్తున్నారు. ఆటోల ద్వారా నిత్యం ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారు. జూకల్ శివారులోని చెత్తదిబ్బలో ఎరువులు తయారు చేస్తున్నారు. బొల్లారం పురాలికలో పారిశుద్ధ్య సమస్య లేదు. సేకరించిన చెత్తను పట్టణ శివారులోని గాంధీనగర్‌లో వేస్తున్నారు.

**జిల్లా కేంద్రం.. అపరిశుభ్రం**

జిల్లా కేంద్రం సంగారెడ్డిలో పారిశుద్ధ్య వ్యవస్థ అధ్వానంగా మారింది. పారిశుద్ధ్య పర్యవేక్షకుడి పోస్టు మూణ్నెల్లుగా ఖాళీగా ఉంది. పట్టణంలోని వ్యాపార కూడళ్లతోపాటు కాలనీల్లో చెత్తాచెదారం కనిపిస్తోంది. ప్రధాన రహదారిపై మాత్రమే పూర్తిగా సేకరిస్తున్నారు. రోడ్డుపై చెత్త వేసే వారికి జరిమానా విధించాల్సి ఉన్నా.. పట్టించుకోవడం లేదు.

**ఈగలు, దోమలు, దుర్వాసన..**

జిల్లాలోని పెద్ద పట్టణాల్లో ఒక్కటైన జహీరాబాద్‌లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. కార్యాలయంలో, క్షేత్రస్థాయిలో పనిచేసే వారు 224 మంది కార్మికులు అవసరం కాగా.. ప్రస్తుతం వంద పైచిలుకు మాత్రమే ఉన్నారు. పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ మరో పురపాలికలో పనిచేస్తున్నారు. వేరే అధికారికి ఇక్కడి బాధ్యతలు అప్పగించారు. ఈగలు, దోమలు, వాసనతో పట్టణ వాసులు ఇబ్బందులు పడుతున్నారు.




## యుద్ధానికి సిద్ధంగా ఉన్నాం.. చిటికేస్తే చాలు దిగిపోతాం : ఇండియన్ ఆర్మీ ప్రకటన

దేనికైనా.. ఏ క్షణమైనా సిద్ధంగా ఉన్నాం.. ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉన్నాం.. ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉన్నాం అంటూ ప్రకటించింది ఇండియన్ ఆర్మీ. భయం లేదు.. కనికరం లేదు.. మమ్మల్ని ఎవరూ ఆపలేరు.. అది ఎలాంటి భూభాగమైనా.. ఎవరి భూభాగమైనా సరే.. ఎంత కఠినంగా ఉన్నా.. మా లక్ష్యాన్ని దూరం కాదు.. కార్యాచరణ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంది.. అంటూ వీడియో రిలీజ్ చేసింది ఇండియన్ ఆర్మీ. పహల్గాంలో ఉగ్రదాడి తర్వాత.. పాకిస్తాన్ పై యుద్ధం చేయాలంటూ.. పాక్ ఆక్రమిత కాశ్మీర్ ను స్వాధీనం చేసుకోవాలంటూ భారతీయుల నుంచి గట్టిగా డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఎన్నాళ్లు ఈ ఉగ్రదాడులు.. ఎన్నాళ్లు భరించాలి.. ఎన్నాళ్లు ఉపేక్షించాలనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇందుకు తగ్గట్టుగానే.. శత్రువులు కలలో కూడా ఊహించని విధంగా విరుచుకుపడతాం అని.. ప్రతికారం కచ్చితంగా ఉంటుందని.. గట్టిగా గుణపాఠం చెబుతామని ప్రధాని మోదీ సైతం వార్నింగ్ ఇచ్చారు. దేశం మొత్తం.. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు.. అన్ని పార్టీలు యుద్ధానికైనా మద్దతు అంటూ ప్రకటించాయి. ఇప్పటికే పాకిస్తాన్ దేశంతో ఉన్న అన్ని సంబంధాలు కట్ అయ్యాయి. దౌత్య, వాణిజ్య పరంగా తెగదెంపులు జరిగాయి. ఇక మిగిలింది యుద్ధమే.. యుద్ధానికి సిద్ధం అన్న సంకేతాలకు బలం ఇస్తూ.. ఇండియన్ ఆర్మీ విడుదల చేసిన వీడియో ఇప్పుడు ఆసక్తి రేపుతోంది. దేనికైనా సిద్ధంగా ఉన్నాం అంటూ ఇండియన్ ఆర్మీ నుంచి %శ% వేదికగా వీడియో రిలీజ్ కావటంతో.. ఏ క్షణమైనా పాకిస్తాన్ పై ఇండియా యుద్ధం ప్రకటించే అవకాశాలు లేకపోలేదు.. భారత్ సైన్యం కూడా సిద్ధంగా ఉన్నామని ప్రకటించిన తర్వాత.. ఇక మిగిలింది కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వటమే..




అమరావతి: మద్యం కుంభకోణం కేసులో సజ్జల శ్రీధర్‌రెడ్డికి మే 6 వరకు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. సిట్ అధికారులు ఆయన్ను విజయవాడ జిల్లా జైలుకు తరలించనున్నారు. ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ యజమాని సజ్జల శ్రీధర్‌రెడ్డి మద్యం కుంభకోణం ప్రధాన కుట్రదారుల్లో కీలక నిందితుడిగా ఉన్నాడు. కేసులో ఏ6గా ఉన్న ఆయన్ను సిట్ అధికారులు శుక్రవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో అరెస్టు చేశారు. శనివారం విజయవాడకు తీసుకొచ్చి ఏసీబీ కోర్టులో హాజరుపర్చారు. 2019లో వైకాపా అధికారం చేపట్టాక నూతన మద్యం విధానం ముసుగులో నెలనెలా రూ.50-60 కోట్ల మేర ముడుపులు ఎలా కొల్లగొట్టొచ్చనే దానిపై చర్చించేందుకు నిర్వహించిన సమావేశాలన్నింటిలోనూ వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి, అప్పట్లో ఆ పార్టీ నాయకుడు విజయసాయిరెడ్డి, నాటి ఐటీ సలహాదారు రాజ్ కెసిరెడ్డి, ఏపీఎస్‌బీసీఎల్ పూర్వపు ఎండీ వాసుదేవరెడ్డి, ఏపీఎస్‌బీసీఎల్ ప్రత్యేకాధికారి సత్యప్రసాద్‌తో కలిసి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

## వివేకా కేసులో సాక్షుల మరణాలపై సిట్ విచారణ వేగవంతం




కడప, ఏప్రిల్ 26: మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో సాక్షులుగా ఉన్న వారు ఒక్కొక్కరుగా అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంపై సిట్ విచారణ చేపట్టింది. ఇందులో భాగంగా వివేకా కేసు సాక్షుల్లో ఒకరైన కసునూరు పరమేశ్వర్ రెడ్డిని పులివెందుల్లో సిట్ పోలీసు అధికారులు ఈరోజు (శనివారం) విచారిస్తున్నారు. అలాగే ఈ కేసులో మరో కీలక సాక్షి మృతుడు రంగన్న భార్య సుశీలమ్మను విచారణకు రావాల్సిందిగా సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. వివేకా హత్య కేసులో మొత్తం ఆరుగురు సాక్షులు మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే ఇటీవల కీలక సాక్షి అయిన రంగన్న మృతితో ఈ కేసును కూటమి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. వరుసగా సాక్షులు మృతి చెందుతుండటం.. ఎందుకు చనిపోతున్నారు అనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇటీవల చనిపోయిన రంగన్న కేసును పోలీసులు తిరగదోడుతున్నారు. రంగన్నకు ముందు వరుసగా ఐదుగురు సాక్షులు మరణించారు. దీంతో సాక్షుల వరుస మరణాలపై విచారణ నిమిత్తం ఇటీవల సిట్‌ను ఏర్పాటు చేసింది కూటమి ప్రభుత్వం. దీంతో గత కొంతకాలంగా పులివెందులలో సిట్ అధికారులు విచారిస్తున్నారు. వివేకా కేసులో సాక్షులుగా ఉన్న వారి మృతి వెనక మిస్టరీ ఏంటనే దానిపై సిట్ ఫోకస్ పెట్టింది. ప్రస్తుతం పులివెందులలో సిట్ విచారణ కొనసాగుతోంది. మొదటగా.. మాజీ మంత్రి వివేకా హత్య జరిగిన సమయంలో సాక్షిగా ఉన్న కుసునూరు పరమేశ్వర్ రెడ్డి ఈరోజు సిట్ అధికారులు విచారిస్తున్నారు. నోటీసులు ఇవ్వకుండా విచారించడంపై పరమేశ్వర్ రెడ్డి వాగ్వాదానికి దిగాడు. అయినప్పటికీ అతడిని తీసుకువచ్చి పులివెందుల్లో విచారిస్తున్నారు. ఇతనితో పాటు ఇటీవల మృతి చెందిన కీలక సాక్షి రంగన్న భార్య సుశీలమ్మను కూడా విచారణకు పిలిపించింది సిట్. ఈ మేరకు సుశీలమ్మకు సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఈరోజు సాయంత్రం విచారణకు రావాల్సిందిగా నోటీసుల్లో పేర్కొన్నారు. ఉదయం కుసునూరు పరమేశ్వర్ రెడ్డిని విచారిస్తున్న సిట్ అధికారులు.. సాయంత్రం రంగన్న భార్య సుశీలమ్మను విచారించనున్నారు. ఇక వీరిద్దరితో పాటు మున్ముందు ఈ కేసులో సాక్షులుగా ఉన్న వారి బంధువులను, అనుమానస్పదంగా ఉన్నవారిని సిట్ అధికారులు విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.




ఇస్లామాబాద్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ఈ క్రమంలోనే న్యూదిల్లీ తీసుకున్న పలు నిర్ణయాలపై పొరుగుదేశంలోని పలువురు మంత్రులు అక్కసు వెళ్లగక్కారు. ఈ పరిణామాలపై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తాజాగా మౌనం వీడారు. పహల్గాం దాడిపై తటస్థ దర్యాప్తునకు తాము సిద్ధమేనని ప్రకటించారు. ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొంటామంటూ వ్యాఖ్యానించారు. ఖైబర్ పఖ్తుంఖ్వాలోని పాకిస్తాన్ మిలిటరీ అకాడమీ గ్రాడ్యుయేషన్ వేడుకల్లో పాల్గొన్న షెహబాజ్ షరీఫ్.. ఉద్రిక్తతల గురించి స్పందించారు. "పహల్గాంలో ఇటీవల జరిగిన విషాదకర ఘటనతో మరోసారి మన దేశం నిందలు ఎదుర్కొంటోంది. ఆ ఘటనపై తటస్థ, పారదర్శక, విశ్వసనీయ దర్యాప్తులో పాల్గొనేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. శాంతికే మా ప్రాధాన్యం" అని షరీఫ్ తెలిపారు. ఉగ్రవాదాన్ని తాము కూడా ఖండిస్తామంటూ శాంతి వచనాలు వల్లె వేశారు. ఈసందర్భంగా ఉగ్రవాదాన్ని సమూలంగా నాశనం చేస్తామంటూ ఇటీవల భారత ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై షరీఫ్ పరోక్షంగా స్పందించారు. "మా దేశ భద్రత, సార్వభౌమత్వంపై ఎన్నటికీ రాజీపడబోం. ఎలాంటి ముప్పును ఎదుర్కోడానికైనా సంసిద్ధంగా ఉన్నాం" అని తెలిపారు. అనంతరం సింధూ జలాల ఒప్పందం నిలిపివేత అంశాన్ని ప్రస్తావిస్తూ.. "భారత్ ఇలా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం తగదు.

ఈ చర్యతో యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని మేం కోరుకుంటున్నాం" అంటూ భారత్‌ను నిందించే ప్రయత్నం చేశారు. ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దీని వెనక పాక్ కేంద్రంగా పనిచేస్తోన్న లష్కరే తోయిబా అనుబంధ సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫోర్స్' హస్తం ఉన్నట్లు భద్రతా బలగాలు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోన్న పాకిస్థాన్‌కు భారత్ గట్టి షాకిచ్చింది. సింధూ జలాల ఒప్పందం నిలిపివేతతో పాటు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పాక్ పౌరులు తక్షణమే దేశం విడిచి వెళ్లిపోవాలని ఆదేశించింది. అటు పాక్ కూడా ప్రతిచర్యలు చేపట్టింది. భారత విమానాలకు తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించింది.




అహ్మదాబాద్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో అన్ని రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. వలసదారులపై ప్రత్యేక నిఘా పెట్టాయి. ఈ క్రమంలోనే గుజరాత్‌లో చేపట్టిన భారీ ఆపరేషన్‌లో 1000 మందికిపైగా బంగ్లాదేశీ అక్రమ వలసదారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వీరంతా తప్పుడు ధ్రువపత్రాలతో రాష్ట్రంలోకి ప్రవేశించినట్లు గుజరాత్ హోంమంత్రి హర్ష్ సంఘవి వెల్లడించారు. శనివారం తెల్లవారుజామున 3 గంటల నుంచి రాష్ట్రంలోని పలు నగరాల్లో పోలీసులు పెద్ద ఎత్తున తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగానే అహ్మదాబాద్‌లో 890 మందిని, సూరత్‌లో 134 మందిని అదుపులోకి తీసుకున్నట్లు హోంమంత్రి తెలిపారు. వీరంతా పశ్చిమ బెంగాల్‌లో సరిహద్దులు దాటి భారత్‌లోకి ప్రవేశించినట్లు పేర్కొన్నారు. అక్కడ ఫోర్జరీ ప్రతాలు పొంది దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లినట్లు తెలిపారు. "వీరిలో చాలా మంది డ్రగ్స్, మానవ అక్రమ రవాణా వంటి నేరాల్లో అనుమానితులుగా ఉన్నారు. ఇటీవల నలుగురు బంగ్లాదేశీయులను అరెస్టు చేయగా.. వారిలో ఇద్దరు అల్‌ఖైదా స్లీపర్ సెల్స్‌తో కలిసి పనిచేస్తున్నట్లుగా గుర్తించాం. ఈ క్రమంలోనే తాజాగా భారీ ఆపరేషన్ చేపట్టాం. వీరందరి పత్రాలను పరిశీలించిన తర్వాత.. త్వరలోనే దేశం నుంచి పంపిస్తాం" అని హర్ష్ సంఘవి వెల్లడించారు. ఇక, రాష్ట్రంలో పాక్ జాతీయులు ఎవరైనా ఉంటే.. కేంద్రం తీసుకున్న నిబంధనల ప్రకారం వారు కూడా వెంటనే గుజరాత్‌ను వీడాలని స్పష్టం చేశారు. చట్ట వ్యతిరేకంగా దేశంలో ఉండే వారిపై న్యాయపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ వలసదారులు వెంటనే పోలీసులకు లొంగిపోవాలని సూచించారు.




అలిపిరి: వేసవి సెలవులు, వారాంతం నేపథ్యంలో తిరుమలకు భక్తుల రద్దీ భారీగా పెరిగింది. శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద వాహనాలను తనిఖీ చేసే ప్రక్రియ ఆలస్యం అవుతోంది. దీంతో వాహనాలు గరుడ కూడలి వరకు నిలిచిపోయాయి. భక్తులు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. దర్శనానికి, వివిధ సేవలకు ముందస్తుగా టికెట్లు పొందిన వారు ఇబ్బందులు పడుతున్నారు. సమయం దాటితే తమను సేవలకు అనుమతించరంటూ వాపోతున్నారు. తనిఖీ కేంద్రం వద్ద 45 మంది ఎస్పీఎఫ్ సిబ్బంది, 15 మంది విజిలెన్స్ సిబ్బంది ఉన్నారు. ఈ సంఖ్యను పెంచితే తనిఖీ త్వరితగతిన అవుతుందని భక్తులు భావిస్తున్నారు.




భారత్‌లో ఉద్యోగాల పెరుగుదలకు సంబంధించి ప్రపంచ బ్యాంకు నివేదిక విడుదల చేసింది. భారత్‌లో ఉద్యోగాల పెరుగుదలలో సానుకూల పవనాలు వీస్తున్నట్లు అందులో పేర్కొంది. 2021-22 నుంచి దేశంలోని కార్మిక మార్కెట్ డైనమిక్స్‌లో గణనీయమైన మార్పు చోటుచేసుకుందని తెలిపింది. ఇందులోభాగంగా నాటి నుంచి పని చేసే జనాభా కంటే వేగంగా ఉద్యోగాల సృష్టి జరుగుతోందని వెల్లడించింది. అంతేకాకుండా శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం వృద్ధి చెందుతున్నట్లు నివేదించింది. గత మూడేళ్లుగా దేశంలో పనిచేసే జనాభా కంటే ఉపాధి వృద్ధి స్థిరంగా ఉందని.. పట్టణాలలో నిరుద్యోగ స్థాయిలు తగ్గుతున్నాయని నివేదిక వెల్లడించింది. 2017-18 ఆర్థిక సంవత్సరం తర్వాత పట్టణ నిరుద్యోగం తగ్గుతూ వచ్చి 2021-22 నాటికి అత్యల్పంగా 6.6 శాతానికి పడిపోయిందని ప్రపంచ బ్యాంకు పేర్కొంది. కరోనా మహమ్మారి తర్వాత దేశంలో ఉపాధి అవకాశాలు మళ్లీ మెరుగుపడ్డాయనడానికి ఇదే సంకేతమని నిపుణులు పేర్కొంటున్నారు. ఉపాధి రంగంలో గమనించదగ్గ మార్పుల్లో ఉద్యోగాల కోసం గ్రామీణప్రాంతాల ప్రజలు అధికంగా పట్టణ ప్రాంతాలకు వలసలు రావడం పెరిగినట్లు నివేదిక పేర్కొంది. 2018-19 తర్వాత మొదటిసారిగా.. ఉపాధి కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు పురుషుల వలసలు గణనీయంగా పెరిగాయని తెలిపింది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు అధికంగా శ్రామిక శక్తిలోకి, ముఖ్యంగా వ్యవసాయ వృత్తిలోకి ప్రవేశిస్తున్నట్లు వివరించింది. మహిళా ఉద్యోగ రేటు పెరుగుతున్నప్పటికీ వేతనాల్లో లింగ అసమానతలు అలాగే ఉన్నాయని పేర్కొంది. ఉద్యోగాలు పెరుగుతున్నప్పటికీ దేశంలో నిరుద్యోగ యువత శాతం పెరుగుతుండడంపై ప్రపంచ బ్యాంకు ఆందోళన వ్యక్తంచేసింది. భారత్‌లో నిరుద్యోగ యువత 13.3 శాతం ఉందని తెలిపింది. ఉన్నత విద్యను పూర్తిచేసిన వారిలో 29 శాతం మంది ఇప్పటికీ ఉద్యోగ అన్వేషకులుగానే ఉన్నారని పేర్కొంది. 2022-23 నాటికి భారత్‌లో పేదరికాన్ని తగ్గించడంలో కొంత పురోగతి సాధించినప్పటికీ, అత్యధిక జనాభా కలిగిన ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ఇప్పటికీ దేశంలోని అత్యంత పేద రాష్ట్రాలుగా ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేసింది. ఉపాధిని మరింత మెరుగుపరచడానికి స్థిరమైన ఆర్థిక సంస్కరణలు, పెట్టుబడుల పెరుగుదల అవసరమని విశ్లేషకులు సూచిస్తున్నారు.

## ఏపీ లిక్కర్ స్కామ్‌లో బిగ్‌బాస్‌ను జైలుకు పంపాలి



అమరావతి: మద్యం కుంభకోణంలో అసలు బిగ్ బాస్‌ను జైలుకు పంపాలని మాజీమంత్రి,తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. బిగ్ బాస్ దురాశ వల్ల నాసిరకం మద్యం తాగి ఎందరో పేదలు ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. మద్యం కుంభకోణం విషయంలో వెంటనే కేంద్రం జోక్యం చేసుకుని సీబీఐ, ఈడీని రంగంలోకి దింపాలని అన్నారు. ఇవాళ(శనివారం) నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో సోమిరెడ్డి మీడియాతో మాట్లాడారు. మద్యపానం నిషేధ హామీతో అధికారంలోకి వచ్చి, మద్యంతో పేదల ప్రాణాలు తీయటం క్షమించరాని నేరమని అన్నారు. జగన్ జమానాలో జరిగిన లిక్కర్ కుంభకోణంలో ఇప్పటి వరకూ రూ.3200కోట్లు మాత్రమే సీఐడీ వెలికితీసిందని, అనధికార లావాదేవీలు ఇంకా పెద్దమొత్తంలో జరిగాయని ఆరోపణలు చేశారు. సీఐడీ మద్యం కుంభకోణం దర్యాప్తులో మరింత లోతుగా వెళ్లాలని అన్నారు. డిపోలకు పోకుండా అనధికారికంగా బయటకు వెళ్లిన మద్యం కుంభకోణం రూ.10వేల కోట్లకు పైమాటే ఉంటుందని చెప్పారు. సీఐడీ దర్యాప్తులో ఒక్కో సమాచారం బయటకు వస్తుంటే ఈడీ ఇంకా ఎందుకు జోక్యం చేసుకోవట్లేదని ప్రశ్నించారు. జగన్ జమానాలో జరిగిన లిక్కర్ స్కామ్ ఓ అంతర్జాతీయ కుంభకోణమని షాకింగ్ కామెంట్స్ చేశారు. రూ.1.35లక్షల కోట్లు నగదు రూపంలో బదిలీ చేసి డిజిటల్ ఆంధ్రాని కాస్తా క్యాషాంధ్రగా మార్చారని విమర్శించారు. జగన్ హయాంలో అడిగిన లంచాలు ఇవ్వలేక నాటి వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మెక్ డోవెల్స్ కంపెనీని మూసేసుకున్నారని అన్నారు. మనుషుల ప్రాణాలు తీసే రసాయనాలు జగన్ హయాంలో జరిగిన మద్యం సరఫరాలో ఉన్నాయని అత్యున్నత ల్యాబ్‌లు నిర్ధారించాయని చెప్పుకొచ్చారు. నాసిరకం మద్యంతో ఎందరో పేదల ప్రాణాలు పోయాయని, దీనికి బాధ్యులైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. నాసిరకం మద్యంతో ప్రాణాలు కోల్పోయిన వారిలో ఎక్కువశాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలే ఉన్నారని చెప్పారు. రూ.100 కోట్ల మద్యం కుంభకోణానికే అరవింద్ కేజ్రీవాల్ అరెస్టైతే... జగన్ హయాంలో జరిగింది రూ.10వేల కోట్ల పై బడిన కుంభకోణం జరిగిందని ఆరోపించారు. కరోన సమయంలో కేవలం 42రోజులు మాత్రమే మద్యం దుకాణాలను మూసివేశారని చెప్పారు. మిగిలిన రోజుల్లో మద్యం దుకాణాల్లో అమ్మకాలు తగ్గి అనధికార అమ్మకాలు పెరిగాయని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వెల్లడించారు.

## జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌పై నెగ్గిన అవిశ్వాస తీర్మానం




విశాఖ: జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌పై కూటమి సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో డిప్యూటీ మేయర్ పదవిని జియాన్ని శ్రీధర్ కోల్పోయారు. 74 మంది సభ్యులు అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేశారు. 63 మంది కూటమి కార్పొరేటర్లు, 11 మంది ఎక్స్‌అఫీషియో సభ్యుల మద్దతుతో ఈ గెలుపు లభించింది. ఇటీవల కూటమి సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో.. మేయర్ కూడా పదవి కోల్పోయిన విషయం తెలిసిందే.




# అనసూయ.. చీరలో కూడా స్టన్నింగ్..

టీవీ యాంకర్‌గా కెరీర్‌ను ప్రారంభించిన అనసూయ, తన ఎనర్జిటిక్ హోస్టింగ్ స్టైల్‌తో ఫ్యాన్ ఫాలోయింగ్‌ను ఏర్పరుచుకుంది. కానీ అక్కడితో ఆగలేదు. సిల్వర్ స్క్రీన్‌పై అడుగుపెట్టి విలక్షణ పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ, ఒక నటి గా తన ప్రత్యేకతను నిలబెట్టుకుంది. “రంగస్థలం” సినిమాలో రంగమ్మత్త పాత్ర ఆమెకు గుర్తింపు తీసుకువచ్చింది. అప్పటి నుంచి గ్లామర్, పవర్‌ఫుల్ రోల్స్‌తో పాటు సోషల్ మీడియాలోనూ క్రేజ్ పెంచుకుంటూ వస్తోంది. ఇప్పుడు అనసూయ తన కొత్త లుక్‌తో మళ్లీ ఫ్యాన్స్ మనసులు దోచేస్తోంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారాయి. బంగారు వర్ణం కలిగిన చీరలో అనసూయ సంప్రదాయ సౌందర్యాన్ని మలుపుతిప్పినట్టుగా కనిపిస్తోంది. ఈ చీరలోని పింక్, గ్రీన్ పువ్వుల డిజైన్లు అందరినీ ఆకర్షించగా, బోల్డ్ లుక్‌కు బదులుగా కాస్త నెమ్మదిగా నవ్వుతూ ఆమె ఇచ్చిన స్టిల్స్ అభిమానులను ఆకట్టుకున్నాయి. ఈ




లుక్‌కు మేకోవర్‌గా చేసిన జ్యువెల్లరీ, మెరిసే చీర, ఎర్రకళ్ల బ్లౌజ్ కూడా అదనపు ఆకర్షణగా నిలిచాయి.

అనసూయ ధరించిన చెవిపోగులు, చేతికడులు ఆమె సంప్రదాయ అందాన్ని మరింతగా హైలైట్ చేశాయి. ముఖ్యంగా ఆమె జడలో పెట్టిన పుష్పాల అలంకరణ ప్రత్యేకంగా చూపుతుంది. మేకప్ సాఫ్ట్‌గా ఉండగా, హైలైట్ అయిన అనసూయ నవ్వే ప్రధాన అస్త్రం అని చెప్పవచ్చు. ఈ ఫోటోలకు 3 గంటల్లోనే వేల సంఖ్యలో లైక్స్ రావడం చూస్తే, అనసూయకి ఉన్న క్రేజ్ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. ఇలా ఫ్యాషన్‌లో ముందుండే అనసూయ ఈసారి సంప్రదాయానికి టచ్ ఇచ్చి అభిమానులను ఆశ్చర్యపరిచింది. ఆమె చూపించిన ఈ లుక్ ఒక పండగ స్పెషల్‌లా అనిపిస్తోంది.

# స్టార్ కిడ్ కి టాలీవుడ్ లాంచింగ్ సంతోషమేనా?

బాలీవుడ్ నటుడు శత్రుఘ్న సిన్హా వారసురాలిగా సోనాక్షి సిన్హా ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. తొలి సినిమా దబాంగ్ తో మంచి విజయం అందుకుంది. అటుపై అమ్మడి బాలీవుడ్ కెరీర్ తిరుగు లేకుండా సాగిపోతుంది. ఇప్పటి వరకూ హీరోయిన్ గా ఎన్నో సినిమాలు చేసింది. వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకుల్ని అలరించింది. కానీ సోనాక్షి మాత్రం ఇండస్ట్రీలో నటిగా బలమైన ముద్ర మాత్రం వేయలేకపోయింది. తనకన్నా వెనకొచ్చిన వారంతా జాతీయ అవార్డులు అందుకున్నారు. నటిగా ప్రత్యేకమైన ఇమేజ్ ని క్రియేట్ చేసుకున్నారు. సోలోగా బాక్సాపీస్ వద్ద సత్తా చాటుతున్నారు. అలియాభట్, కృతిసనన్, కియారా అద్వాణీ లాంటి వారు ఎంతగా ఫేమస్ అయ్యారు? అన్నది చెప్పాల్సిన పనిలేదు. కానీ సోనాక్షి మాత్రం వాళ్లలో ఫేమస్ కాలేకపోయింది. ప్రతిభావంతురాలైనా? అమ్మడికి ఆవగింజంత



అదృష్టం రాకపోవడం అన్నది శోచనీయం. ఇక వ్యక్తిగత జీవితంలో సోనాక్షి రైటర్ జహీర్ ఇక్బాల్ ని ప్రేమించి పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ధాంపత్య జీవితంలో సంతోషంగా ఉంటుంది. బాలీవుడ్ లో ఒకటి రెండు సినిమాలు కూడా చేస్తుంది. కానీ సోనాక్షికి బ్యాకప్ కి ఇంకా పెద్ద సినిమాలు చేయాలి. ఆ సంగతి పక్కన బెడితే తాజాగా సోనాక్షి టాలీవుడ్ లో కూడా లాంచ్ అవుతోన్న సంగతి తెలిసిందే. సుధీర్ బాబు హీరోగా నటిస్తోన్న జఠాధర లో నటిస్తోంది. ఇందులో ఓ శక్తివంతమైన పాత్రలో నటిస్తోంది.

దీంతో సోనాక్షి సినిమాల పట్ల ఫ్యాషన్, తనలో డౌన్ టూ ఎర్త్ క్వాలిటీ బయట పడుతుంది. సాధారణంగా బాలీవుడ్ స్టార్ హీరోయిన్లు అంటే? అదే రేంజ్ ఉన్న సినిమాలు ఎంచుకుంటారు. భారీ కాన్వాస్...భారీ బడ్జెట్ అంటూ వంద రకాల ఆలోచనలతో ఉంటారు. కానీ సోనాక్షి అలాంటి వారికి భిన్నమని తెలుస్తోంది. గతంలో సోనాక్షి సిన్హా సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన లింగ సినిమాలో భార్య పాత్ర పోషించిన సంగతి తెలిసిందే.

ఇద్దరి మధ్య వయసు వ్యత్యాసం ఉన్నా? ఆ పాత్రకు సోనాక్షి పర్ఫెక్ట్ గా సూటవ్వడంతోనే ఆ ఛాన్స్ తీసుకుంది.

# కలియుగం 2064లో ఇలా ఉంటుందా..?




నేషనల్ వైడ్ గా సినిమాలకు పెరిగిన స్కోప్.. ఇంకా బడ్జెట్ విషయంలో నో కాంప్రమైజ్ అనే డేర్ నెస్ వల్ల కొన్ని అద్భుతమైన కథలు తెర మీద చూడగలుగుతున్నాం. అఫ్కోర్స్ దాన్ని ఎవరు మొదలు పెట్టారు అన్న దాని కన్నా దర్శకులంతా ఆ మూమెంట్ ని కొనసాగించడం అన్నది గొప్ప విషయం. ముఖ్యంగా కల్కి 2898 ఏడి లాంటి సినిమా ఒకటి వస్తుందని.. అది తెర మీద అద్భుతాలు చూపిస్తుందని ఎవరు ఊహించి ఉండరు. నాగ్ అశ్విన్ తన క్రియేటివిటీతో 2898 %ూణ% అంటూ ఒక అద్భుతాన్ని చూపించాడు. కల్కి సినిమా తర్వాత అలాంటి ప్రయత్నాలు చాలా వస్తున్నాయి. ఈ క్రమంలో కన్నడ పరిశ్రమ నుంచి వస్తున్న సినిమా కలియుగం 2064. నాగ్ అశ్విన్ ఎప్పుడో 2898 %ూణ% గా చూపిస్తే దర్శకుడు ప్రమోద్ సుందర్ మాత్రం కలియుగం 2064 లోనే కాలం ఎలా మారుతుందో చూపించాడు. కలియుగం 2064 ట్రైలర్ చూస్తే ఇది కల్కి కి కాస్త దగ్గరగా ఉందని అనిపిస్తున్నా ఈ సినిమా సంథింగ్ స్పెషల్ గా ఉంటుందనిపిస్తుంది. కలియుగం 2064 సినిమాలో శ్రద్ధ శ్రీనాథ్, కిషోర్ ప్రధాన పాత్రలుగా నటిస్తున్నారు. ట్రైలర్ లో ప్రజలు తినడానికి ఏమి దొరక్క ఇబ్బంది పడటం చూపిస్తూ మిగతా అంతా కూడా కల్కి ఫార్మాట్ లోనే ప్లాన్ చేశారు. కలియుగం సినిమాను ఆర్కె ఇంటర్నేషనల్ ఇంక్. ప్రైమ్ సినిమాస్ నిర్మిస్తున్నారు. ట్రైలర్ తో సంథింగ్ ఇంట్రెస్ట్ ని క్రియేట్ చేసిన ఈ సినిమాను మే 9న రిలీజ్ లాక్ చేశారు. ఈమధ్య శ్రద్ధ శ్రీనాథ్ తెలుగులో వరుస సినిమాలు చేసింది. వెంకటేష్ తో సైంధవ్ సినిమా చేసిన అమ్మడు విశ్వక్ సేన్ తో మెకానిక్ రాకీ చేసింది. ఇక ఈ సంక్రాంతికి డాకు మహారాజ్ సినిమా తో కూడా అలరించింది. మరి ఈ కలియుగం అమ్మడికి కలిసి వస్తుందా లేదా అన్నది చూడాలి. ఈమధ్య ఆడియన్స్ కూడా కొత్త కథ అద్భుతమైన విజువల్స్ ఉన్నాయి అంటే సినిమాలు చూసేస్తున్నారు. తప్పకుండా ఈ కలియుగానికి అది కలిసి వచ్చే అంశమే అని చెప్పొచ్చు. ఐతే కలియుగం 2064 ట్రైలర్ చూడగానే ఎక్కువమంది ప్రభాస్ కల్కితో పోల్చడం కామనే. ఐతే అందులో లాగా 3 ప్రాంతాలు లేవు కానీ కలియుగం కొత్త ఎక్స్ పెరిమెంట్ గా అనిపిస్తుంది.

# మెగాస్టార్ విశ్వంభర.. మళ్లీ సమస్యేంటి?



మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న విశ్వంభర సినిమా మొదట్లో అభిమానుల్లో అంచనాలు ఏ స్థాయిలో ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దర్శకుడు వశిష్ట బింబిసార సినిమాతో సాలీడ్ హిట్ అందుకున్న తరువాత చేస్తున్న సినిమా కావడంతో ఎనౌన్స్ చేసినప్పుడే సినిమాపై హైప్ క్రియేట్ అయ్యింది. అయితే, ఈ సినిమా విడుదలపై అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. దీంతో సినిమా అవుట్ పుట్ పై కూడా రకరకాల గాసిప్స్ పుట్టుకొస్తున్నాయి. అసలైతే ఈ సినిమాను ఈ ఏడాది సంక్రాంతికి రిలీజ్ చేయాలని అనుకున్నారు. కానీ అప్పటికి గేమ్ ఛేంజర్ ఉండడం వల్ల వెనక్కి తగ్గారు. అంతే కాకుండా గ్రాఫిక్స్ విషయంలో అంతగా సంతృప్తి చెందకపోవడం కూడా మరొక రీజన్ అని టాక్ వచ్చింది. దీంతో మే నెలకి వాయిదా వేసారు. ఇప్పుడు మళ్ళీ కొత్త తేదీపై క్లారిటీ లేకపోవడంతో మెగా అభిమానుల్లో ఆందోళన మొదలైంది. ఈ ఆలస్యం వెనుక ఉన్న అసలు కారణం విశ్వంభర విజువల్ ఎఫెక్ట్స్ పనులు అన్నది ఇండస్ట్రీ వర్గాల సమాచారం. టాలీవుడ్ లో ఇప్పటివరకు అనుకున్నట్టు గ్రాఫిక్స్ పనులు ఫినిష్ కాలేదట, దీంతో మరింత సమయం పట్టేలా ఉన్నట్లు టాక్ వస్తోంది. యువీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్, అత్యుత్తమ క్వాలిటీకి ఏమాత్రం తగ్గకుండా ఉండాలని నిర్మాతలు నిర్ణయించుకున్నారు. అందుకే, హాలీవుడ్ స్థాయిలో విజువల్ ఎఫెక్ట్స్ రూపొందించేందుకు ప్రముఖ స్టూడియోల సహాయాన్ని తీసుకుంటున్నారు. అవతార్ చిత్రానికి పని చేసిన టాప్ వీఎఫ్ఎక్స్ కంపెనీలు కూడా విశ్వంభర కోసం పని చేస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే నాగ్ అశ్విన్ కూడా ఇన్ పుట్స్ ఇచ్చినట్లు ఆమధ్య రకరకాల కథనాలు వచ్చాయి. దీంతో సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పని మరింత సమయం తీసుకుంటోంది. మెగాస్టార్ చిరంజీవి లీడ్ రోల్ లో కనిపించనుండగా, చిత్రంలోని ఫ్యూచరిస్టిక్ కాన్సెప్ట్ మిక్స్ కావడం మరో ప్రధాన ఆకర్షణ. ఇప్పటికే విడుదలైన కాన్సెప్ట్ పోస్టర్, టీజర్ లకు మంచి స్పందన వచ్చినా, ఫైనల్ అవుట్‌పుట్ ఎలా ఉండబోతుందనేదానిపై అందరికీ భారీ ఆసక్తి నెలకొంది. ఈ స్థాయిలో భారీ గ్రాఫిక్స్‌తో రూపొందిస్తున్న సినిమా కావడంతో, ప్రేక్షకుల అంచనాలకు తగ్గట్లు క్వాలిటీని మిస్సవ్వకుండా తీసుకురావాలని టీం చాలా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇకపోతే, సినిమా ఆలస్యమవుతున్నా, నటీనటులు మాత్రం ప్రాజెక్ట్‌పై పూర్తి నమ్మకంతో ఉన్నారు. సినిమాలో త్రిష, ఆశికా రంగనాథ్, కునాల్ కపూర్ వంటి స్టార్స్ నటిస్తుండగా, వారికి సంబంధించిన కీలక సన్నివేశాల షూటింగ్ ఇప్పటికే పూర్తయినట్లు తెలుస్తోంది. ఇప్పుడు, గ్రాఫిక్స్, విజువల్ ఎఫెక్ట్స్ పనుల కోసం మాత్రమే ఆలస్యం జరుగుతోందని టీమ్ చెబుతోంది. అయితే, మే నెలలో కూడా సినిమా రావడం కష్టమేనన్న వార్తలు ఇండస్ట్రీలో వినిపిస్తున్నాయి. ఇటీవల టాలీవుడ్‌లో భారీ బడ్జెట్ సినిమాల విడుదల వాయిదాలు సాధారణంగా మారిపోయాయి. ఆదిపురుష, సలార్, హనుమాన్ వంటి సినిమాలు క్వాలిటీ మెరుగుపరిచే క్రమంలో ఆలస్యమయ్యాయి. అలాగే విశ్వంభర కూడా అదే బాటలో వెళ్తోందా లేదా థియేట్రికల్ రిలీజ్ కోసం మరో షాకింగ్ అప్డేట్ వస్తుందా అనే ప్రశ్న మెగా అభిమానుల మదిలో ఉంది.

# ఏంటి ఇది నిజమేనా సమంతా..?

విజయ్ దేవరకొండతో ఖుషి సినిమా చేసిన సమంత ఆ తర్వాత హెల్త్ ఇష్యూస్ వల్ల కాస్త గ్యాప్ తీసుకుంది. ఆ నెక్ట్స్ బాలీవుడ్ లో సిటాడెల్ సీరీస్ లో నటించింది. ఐతే అదే టైం లో సమంత సొంత బ్యానర్ లో ట్రాలాలా మూవీస్ ని మొదలు పెట్టింది. తన ప్రొడక్షన్ లో తొలి సినిమాగా మా ఇంటి బంగారం అంటూ ఒక పోస్టర్ వదిలింది. అందులో సమంత తుపాకి పట్టుకుని ఉంది. ఆ సినిమా ఏమైందో ఏమో కానీ సడెన్ గా సమంత తన బ్యానర్ లో శుభం సినిమాతో సర్ ప్రైజ్ చేసింది. ప్రవీణ్ కండ్రేగుల డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో అంతా న్యూ ఏజ్ యాక్టర్స్ ని తీసుకుంది. కామెడీ థ్రిల్లర్ సినిమాగా శుభం ని తెరకెక్కించారు. రిలీజైన టీజర్ కూడా ఆడియన్స్ ని ఇంప్రెస్ చేసింది. ఐతే సమంత బ్యానర్ లో మొదలు పెట్టిన మా ఇంటి బంగారం ఏమైంది. ఈ శుభం ఎక్కడ నుంచి వచ్చింది అనుకుంటున్నారు. ఐతే శుభం సినిమా గురించి మరో న్యూస్ ఏంటంటే సమంత మా ఇంటి బంగారం సినిమానే శుభంగా మార్చాలని చెబుతున్నారు. శుభం సినిమాలో సమంత కూడా ఉంటుందని. ఐతే ఆడియన్స్ ని కన్ ఫ్యూజ్ చేసేందుకే టైటిల్ మార్చినట్టు చెబుతున్నారు. సమంత బ్యానర్ లో తెరకెక్కిన తొలి




సినిమాగా శుభం పై మంచి బజ్ ఉంది. సమంత ఫ్యాన్స్ అయితే ఈ సినిమాకు తమ సపోర్ట్ అందించాలని ఫిక్స్ అయ్యారు. ఇంతకీ సమంత మా ఇంటి బంగారమే శుభం గా మారిందా.. ఈ శుభం సినిమాలో సమంత కూడా ఉంటుందా లాంటి విషయాలు తెలియాలంటే మే 9 దాకా వెయిట్ చేయాల్సిందే. సమంత ఇక మీదట బాలీవుడ్ లోనే కెరీర్ కొనసాగించాలని నిర్ణయించుకున్నదని అంటున్నారు.

ఐతే అమ్మడి ఫ్యాన్స్ మాత్రం ఆమెను తెలుగు సినిమాల్లో చూడాలని కోరుతున్నారు. ఐతే సమంత ఒకవేళ తెలుగు సినిమాలు చేసినా కమర్షియల్ సినిమాల కన్నా ఫిమేల్ సెంట్రిక్ సినిమాల మీద ఎక్కువ ఫోకస్ చేయాలని చూస్తుంది. ఐతే సమంత చేయాలని చెప్పాలే కానీ ఆమె కోసం సరికొత్త కథలతో అప్రోచ్ అయ్యే దర్శక నిర్మాతలు ఉన్నారని చెప్పొచ్చు. మరి సమంత నెక్ట్స్ తెలుగు సినిమా ఏది అవుతుంది అన్నది చూడాలి.

# మాళవిక శర్మ బోల్డ్ లుక్స్.. లెగ్స్ అందాలతో స్టన్నింగ్

టాలీవుడ్‌లో గ్లామరస్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న మాళవిక శర్మ తన ఫోటో షూట్స్ తో కుర్రకారును గట్టిగానే ఆకట్టుకుంటుంది. సినిమాల్లో అవకాశాలు తగ్గినా, సోషల్ మీడియా ద్వారా తన ప్రత్యేకమైన స్టైల్‌ను చూపిస్తూ ఫాలోయింగ్ పెంచుకుంటోంది. ఇటీవలే ఈ భామ ఓ బోల్డ్ ఫోటోషూట్‌లో పాల్గొని అందరి దృష్టిని ఆకర్షించింది. బ్లాక్ అండ్ వైట్ టోన్‌లో తీసిన ఈ ఫోటో ఆమె స్టన్నింగ్ లుక్స్‌తో వైరల్ అవుతోంది. మూడ్ ఫోటోగ్రఫీకి కొత్త దారులు వేసేలా మాళవిక చూపిన ఎక్స్‌ప్రెషన్స్ అభిమానులను మంత్రముగ్ధులను చేశాయి. ‘నేల టికెట్’ సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగు పెట్టిన మాళవిక శర్మ, ఆ తర్వాత ‘రెడ్’ చిత్రంతో సక్సెస్ అందుకుంది. కానీ, అనంతరం ఆశించిన స్థాయిలో అవకాశాలు రాకపోవడంతో తమిళ సినిమాలకు వెళ్ళిపోయింది. ఇటీవల ‘కాఫీ విత్ కాదల్’, ‘భీమా’, ‘హరోం హర’ వంటి చిత్రాల్లో నటించినా, అవి పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. దీంతో మాళవిక తన కెరీర్‌ను నడిపించుకునేందుకు కొత్త మార్గాన్ని ఎంచుకుంది. ఫోటోషూట్‌లు, బ్రాండ్ ప్రమోషన్లతో పాటు, తన గ్లామర్ పిక్స్‌తో సోషల్ మీడియాలో హీట్ పెంచేస్తోంది. తాజాగా వచ్చిన ఈ ఫోటోషూట్ మరింత



ప్రత్యేకతను సంతరించుకుంది. ఓపెన్ షర్ట్, బోల్డ్ లుక్స్‌తో మాళవిక తన హాట్ సైడ్‌ను చూపిస్తూ, ఫ్యాషన్ స్టేట్‌మెంట్ ఇచ్చింది. ‘కొన్ని మహిళలు అణచివేయబడటానికి కాదు.. వారిని అర్థం చేసుకునే ఎవరో ఒకరు వస్తే వారితో స్వేచ్ఛగా పరిగెత్తడం ఉత్తమం’ అంటూ క్యాప్షన్ పెట్టింది. ఈ మాటలు ఆమె గ్లామర్ లుక్స్‌తో మిళితమై నెట్టింట్లో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. అభిమానులు ఈ ఫోటోషూట్‌పై లైకులు, కామెంట్స్ వర్షం కురిపిస్తున్నారు. గతంలోనూ మాళవిక సోషల్ మీడియాలో చాలా గ్లామరస్ లుక్స్ షేర్ చేసుకుంది. కానీ, ఈ సారి పూర్తి బోల్డ్ స్టైలింగ్‌తో దర్శనమివ్వడం విశేషం. ప్రత్యేకంగా కుర్చుని ఇచ్చిన ఈ స్టన్నింగ్ లుక్స్ ఆమె అట్రాక్షన్‌ను మరో స్థాయికి తీసుకెళ్లాయి. మాస్ క్యాప్షన్, స్టైల్, లుక్స్ అన్నీ కలిపి మాళవిక ఈసారి ఇంటర్నెట్‌ను షేక్ చేసేసింది. ముఖ్యంగా యూత్ ఫాలోయింగ్ పెంచుకోవడానికి ఇలాంటి ఫోటోషూట్‌లే ప్రధాన కారణం అనే చెప్పాలి. ప్రస్తుతం మాళవిక సినిమాల కంటే, సోషల్ మీడియా ప్రమోషన్లు, బ్రాండ్ షూట్స్ మీద ఎక్కువగా దృష్టి పెడుతోంది. మరి ఆమె భవిష్యత్తులో ఎలాంటి ఆఫర్స్ అందుకుంటుందో చూడాలి.



## రాజకీయాల్లోకి కొత్త తరం రావాలి: రాహుల్ గాంధీ

హైదరాబాద్: గత పదేళ్లలో ప్రపంచ రాజకీయాలు మారిపోయాయని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అన్నారు. ఆధునిక సామాజిక మాధ్యమాలతో అంతా మారిపోయిందన్నారు.

హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో కొనసాగుతున్న భారత్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడారు. రాజకీయాల్లోకి కొత్తతరం రావాలని ఆకాంక్షించారు. అప్పుడే కొత్త ఆలోచనలు పుట్టుకొచ్చి, దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని అన్నారు. ఈ సందర్భంగా ఎన్నికలకు ముందు కన్యాకుమారి నుంచి సుమారు 4 వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసినట్లు రాహుల్ గుర్తు చేసుకున్నారు.

పాదయాత్రకు ముందు చాలా ఆలోచించానని, అయితే, మొదలు పెట్టిన తర్వాత వెనకడుగు వేయలేదని అన్నారు. ఆ తర్వాత చాలా మంది తనతో కలిసి నడవడం మొదలు పెట్టినట్లు చెప్పారు.




హైదరాబాద్: సమాజంలోని అన్ని వర్గాల ఆకాంక్షలు నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దీనికోసం అనేక పథకాలను తీసుకొచ్చామన్నారు. దేశంలోనే అతిపెద్ద రైతు రుణమాఫీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, ఇప్పటికే రూ.20 వేల కోట్లు రుణమాఫీ చేశామని చెప్పారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన భారత్ సమ్మిట్‌లో పాల్గొని ఆయన మాట్లాడారు. "రైతు భరోసా కింద ఎకరాకు రూ. 12 వేలు ఇస్తున్నాం. వరికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నాం. పట్టభద్రులు సర్టిఫికెట్ తీసుకుంటున్నారు. కానీ ఉద్యోగాలు లేవు. యువత కోసం రాజీవ్ యువ వికాసం పథకం తీసుకొచ్చాం. ప్రజలకు ఏ సమయంలో ఏది అవసరమో కాంగ్రెస్‌కు బాగా తెలుసు" రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమ్మిట్‌కు పలువురు మంత్రులు, కాంగ్రెస్ నేతల, విదేశీ ప్రతినిధులు హాజయ్యారు. వివిధ అంశాలపై చర్చలు కొనసాగుతున్నాయి. బహుళత్వం- వైవిధ్యం, పోలరైజేషన్‌ను అధిగమించడం, వేగవంతమైన న్యాయం, అనిశ్చితికాలంలో ఆర్థిక న్యాయం, ప్రపంచ శాంతి, న్యాయంపై చర్చలు జరుగుతున్నాయి.

## భారాస 10 ఏళ్లలో సాధించలేదని.. ఏడాదిన్నరలో సాధించాం: ఉత్తమ్ కుమార్



హైదరాబాద్: కేసీఆర్ ప్రభుత్వం నాసిరకం పనులతో ప్రాజెక్టులను నాశనం చేసిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులకూ ప్రమాదం పొంచి ఉందని ఎన్‌డీఎస్ఏ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. కాళేశ్వరం కోసం రూ.లక్ష కోట్లు ఖర్చు చేశారని, ఇంత మొత్తంలో వృథా చేస్తే ఇతర దేశాల్లో పెద్ద శిక్షలు పడేవన్నారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో కొనసాగుతున్న భారత్ సమ్మిట్‌లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. "రూ.వేల కోట్లు అప్పులు తెచ్చి ప్రాజెక్టులు కట్టారు. కాళేశ్వరం, అన్నారం, సుందిళ్ల నిరుపయోగంగా ఉన్నా కూడా అత్యధిక పంట పండింది. యాసంగిలో 127 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండింది. తాజాగా సీతారామసాగర్, సీతమ్మసాగర్ ప్రాజెక్టులకు కేంద్రం అనుమతి ఇచ్చింది. ఏడాదిన్నరగా మేం చేసిన కృషి ఫలించింది. తెలంగాణకు ఇది పెద్ద ముందడుగు. దశాబ్దకాలంగా భారాస సాధించలేనిది.. మేం ఏడాదిన్నరలోనే సాధించాం. ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులకు ఈ ప్రాజెక్టులు ఎంతో ఉపయోగకరం. ఈ రెండు ప్రాజెక్టులు వేగవంతంగా పూర్తి చేస్తాం" అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.




హైదరాబాద్: కాళేశ్వరం కథ త్వరలోనే అందరికీ తెలుస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రీడిజైనింగ్ పేరుతో కాళేశ్వరం చేపట్టి మోసం చేశారన్నారు. "తెలివున్న వారెవరైనా కాళేశ్వరం చేపడతారా? మేడిగడ్డ కుంగిపోవడం చిన్న విషయం అన్నట్లుగా మాట్లాడారు. మేడిగడ్డ, సుందిళ్ల పనికిరావని ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చింది. వాటిలో నీళు నింపితే ఈపాటికే మొత్తం కొట్టుకుపోయేది. ప్రాజెక్టు నిర్మాణానికి తుమ్మిడిహట్టి సరైన ప్రాంతమని ఇంజినీర్లు చెప్పారు. తుమ్మిడిహట్టి పూర్తయితే కాంగ్రెస్‌కు పేరు వస్తుందని పక్కన పెట్టారు" అని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

## పాక్ వెన్నులో వణుకు పుట్టేలా చర్యలు: కేంద్ర మంత్రి బండి సంజయ్



హైదరాబాద్: పాక్ వెన్నులో వణుకు పుట్టేలా చర్యలుంటాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఎంసీహెచ్ఆర్‌డీలో నిర్వహించిన 'రోజ్‌గార్ మేళా'లో ఆయన పాల్గొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన 100 మందికి నియామక పత్రాలు అందజేసి మాట్లాడారు. తుపాకీ పట్టినోడు ఆ తుపాకీకే బలవుతాడని చెప్పారు. పహల్గాం ఘటన ఉగ్రవాదుల రాక్షసత్వానికి పరాకాష్ఠ అని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నట్లు పాక్ రక్షణమంత్రి అంగీకరించారని గుర్తుచేశారు. భిక్షమెత్తుకునే దుస్థితికి చేరినా పాక్ బుద్ధి మారడం లేదన్నారు. అభివృద్ధిలో దూసుకుపోతున్న భారత్‌ను చూసి ఓర్వలేకపోతోందని విమర్శించారు. ప్రధాని మోదీ తీసుకునే కఠిన నిర్ణయాలకు అంతా అండగా నిలవాలన్నారు. రోజ్‌గార్ మేళాలో కష్టపడి ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు బండి సంజయ్ అభినందనలు తెలిపారు. ఇష్టపడి పనిచేసి దేశానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలు చిట్టచివరి వ్యక్తికి కూడా అందేలా చేయాలన్నారు.



## ఉగ్రవాదుల రహస్య స్థావరం ధ్వంసం.. పెద్దఎత్తున ఆయుధాలు స్వాధీనం

పహల్గాంలో పర్యటకులపై ఉగ్రదాడి తర్వాత ముష్కరులను పట్టుకునేందుకు భద్రతా దళాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. ఇందులో భాగంగా కశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో ఉగ్రవాదుల రహస్య స్థావరాన్ని భద్రతాదళాలు గుర్తించి.. ధ్వంసం చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే వారి స్థావరాల నుంచి భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఉగ్రస్థావరాలు ఉన్నాయని నిర్దిష్ట నిఘా వర్గాల సమాచారం మేరకు.. ఉత్తర కశ్మీర్ జిల్లాలోని సెడోరి నాలా అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు సోదాలు నిర్వహించాయని అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో ప్రజల శాంతి భద్రతలకు భంగం కలిగించాలనే లక్ష్యంతో ముష్కరులు కుట్రపన్నుతున్నారని సమాచారం వచ్చిందని.. ఈ సమయంలో సైన్యం వారి స్థావరాలను ధ్వంసం చేయడం ఉగ్రవేటలో మరో ముందడుగని అన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో పౌరులు ప్రాణాలు కోల్పోవడంతో భారత ప్రభుత్వం ఉగ్రవాదులపై ఉక్కుపాదం మోపుతోంది. నాటి నుంచి భద్రతా దళాలు వారి ఆచూకీ కోసం రాష్ట్రం అంతటా జల్లెడపడుతున్నారు. మరోవైపు కుల్గాం జిల్లాలో ఉగ్రవాదులతో కలిసి పనిచేస్తున్న ఇద్దర్ని భద్రతా దళాలు శనివారం అరెస్టు చేశాయి. ఖైమోహ్ ప్రాంతంలో వీరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపాయి. అయితే, వారి పేర్లు, ఇతర వివరాలను భద్రతా సిబ్బంది వెల్లడించలేదు.




## రేపటిలోగా వెళ్లిపోండి.. హైదరాబాద్‌లో ఉంటున్న నలుగురు పాక్ పౌరులకు నోటీసులు

హైదరాబాద్: కేంద్ర హెూంశాఖ ఆదేశాలతో పలు రాష్ట్రాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. వివిధ రాష్ట్రాల్లో ఉంటున్న పాకిస్థానీయులను గుర్తిస్తున్నారు. హైదరాబాద్‌లో ఉంటున్న నలుగురు పాక్ పౌరులకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. వీరు షార్ట్ టర్మ్ వీసాలతో ఉంటున్నట్లు గుర్తించారు. రేపటిలోగా హైదరాబాద్ విడిచి వెళ్లాలని ఆదేశించారు. హైదరాబాద్‌లో మొత్తం 213 మంది పాకిస్థానీయులు ఉన్నట్లు గుర్తించారు.




శ్రీనగర్: పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి తర్వాత ముష్కరులను పట్టుకునేందుకు భద్రతా దళాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. లష్కరే తోయిబా ఉగ్ర ముఠాతో సంబంధం ఉన్న ఉగ్రవాదులు, అనుమానితుల కోసం తీవ్రంగా గాలిస్తున్నాయి. ఈక్రమంలోనే వారి ఇళ్లను వెతికి వాటిని ధ్వంసం చేస్తున్నాయి. జమ్మూకశ్మీర్ వ్యాప్తంగా శుక్రవారం రాత్రి ఐదుగురు ఉగ్రవాదుల నివాసాలను పేల్చేశాయి. షోపియాన్‌లోని చోటిపొరా గ్రామంలో లష్కరే తోయిబా కమాండర్ షాహిద్ అహ్మద్ నివాసాన్ని భద్రతా బలగాలు పేల్చేశాయి. ఇతడు గత మూడు, నాలుగు సంవత్సరాలుగా ఉగ్ర సంబంధిత కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్నాడని అధికారులు వెల్లడించారు. కుల్గాంలోని మతాలం ప్రాంతంలో మరో యాక్టివ్ టెర్రరిస్ట్ జాహిద్ అహ్మద్ నివాసాన్ని ధ్వంసం చేశారు. ఇదే జిల్లాలో లష్కరేకు చెందిన మరో ఉగ్రవాది ఇషాన్ అహ్మద్ షేక్ నివాసాన్ని పేల్చేశారు. 2023 జూన్ నుంచి ఇతడు దేశ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్లు గుర్తించారు. కుల్గాంలోని ముర్రాన్ ప్రాంతంలో ఉగ్రవాది అహ్సన్ ఉల్ హక్ ఇంటిని బాంబులతో కూల్చారు. అహ్సన్ 2018లో పాకిస్థాన్ వెళ్లి ఉగ్ర శిక్షణ తీసుకున్నట్లు దర్యాప్తులో తేలింది. ఆ తర్వాత కశ్మీర్ లోయలోకి తిరిగొచ్చి ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు నిఘా ఏజెన్సీలు పేర్కొన్నాయి.

ఇక, పుల్వామాలోని కాచిపొరా ప్రాంతంలో హరీస్ అహ్మద్ అనే ముష్కరుడి ఇంటిని బాంబులతో కూలగొట్టారు. ఇతడు కూడా 2023 నుంచి లష్కరే తరఫున యాక్టివ్‌గా పని చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వీరందరిపైనా ఇప్పటికే కేసులు నమోదైనట్లు అధికారిక వర్గాల సమాచారం. కాగా.. పహల్గాం దాడికి పాల్పడిన ముష్కరుల్లో ఒకడైన ఆదిల్ హుస్సేన్ థోకర్, మరో ఉగ్రవాది ఆసిఫ్ షేక్ ఇళ్లు నేలమట్టమైన సంగతి సంగతి తెలిసిందే. వేర్వేరు పేలుడు ఘటనల్లో ఇవి ధ్వంసమైనట్లు అధికారులు తెలిపారు. వారి ఇళ్లల్లో అప్పటికే బాంబులు అమర్చి ఉన్నాయని, భద్రతా బలగాలను ట్రాప్ చేయడం కోసమే వాటిని యాక్టివేట్ చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

**ఇద్దరు ఉగ్ర అనుచరుల అరెస్టు..** మరోవైపు కుల్గాం జిల్లాలో ఉగ్రవాదులతో కలిసి పనిచేస్తున్న ఇద్దరు అనుచరులను భద్రతా దళాలు శనివారం అరెస్టు చేశాయి. ఖైమోహ్ ప్రాంతంలో వీరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపాయి. అయితే, వారి పేర్లు, ఇతర వివరాలను భద్రతా సిబ్బంది వెల్లడించలేదు.

## తెలంగాణలో ఈ ప్రాంతాలకు వెళ్లండి.. రాహుల్‌గాంధీని ఎక్స్ వేదికగా కోరిన కేటీఆర్



హైదరాబాద్: హైదరాబాద్ హెచ్ఐసీసీలో జరుగుతున్న భారత్ సమ్మిట్ సదస్సులో పాల్గొనేందుకు వస్తున్న కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కోరారు. లగచర్ల గ్రామం, సుంకిశాల, ఏదైనా హైడ్రా కూల్చివేత ప్రదేశం, మూసీ కూల్చివేతల ప్రాంతం, హెచ్‌సీయూ కంచ గచ్చిబౌలిని సందర్శించాలని 'ఎక్స్' వేదికగా సూచించారు. కలుషితాహారం కారణంగా మరణించిన గురుకుల విద్యార్థుల కుటుంబాలను, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను కలవాలన్నారు. కూలిపోయిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్, ఫోర్త్ సిటీ, మొదటి ఏడాది రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన అశోక్ నగర్‌ను సందర్శించాలని కేటీఆర్ సూచించారు. తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిన వినాశనం గురించి వినడానికి మీకు 'అద్భుతమైన' సమయం లభిస్తుందని ఆశిస్తున్నాను అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## కేసీఆర్‌కు థ్రెట్.. ఎంపీ అరవింద్ షాకింగ్ కామెంట్స్

హైదరాబాద్: మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబంపైన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ సంచలన కామెంట్స్ చేశారు. కేసీఆర్‌కు ఆయన కుటుంబ సభ్యుల నుంచి ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందుకే గత కొన్నేళ్లుగా కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో ఉంటున్నారని అన్నారు. అందరు ఒకే దగ్గర ఉంటే తనను కుటుంబ సభ్యులే చంపే అవకాశం ఉందనే భయంతో కేసీఆర్ దూరంగా ఉంటున్నారని ఎంపీ ధర్మపురి అరవింద్ షాకింగ్ కామెంట్స్ చేశారు. ఇవాళ(శనివారం) హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఎంపీ ధర్మపురి అరవింద్ మీడియాతో మాట్లాడారు. కన్నా బిడ్డలు ఆయనను కలవాలన్న ముందుగా అపాయింట్మెంట్ ఉండాల్సిందేనని ఎంపీ ధర్మపురి అరవింద్ చెప్పారు. మాజీ మంత్రి కేటీఆర్‌పై అరవింద్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి అక్రమాలపై టెక్నికల్ రిపోర్ట్‌ను మీడియాకు ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా వచ్చిన డబ్బుతోనే రేపు ప్లీనరీ సభ పెడుతున్నారని అరవింద్ ఆరోపించారు. కేసీఆర్ కుటుంబం, అప్పటి ఇరిగేషన్ మంత్రిపైన సీబీఐ , ఈడీ విచారణ జరిపి జైల్లో పెట్టాలని అన్నారు. కేసీఆర్ కంటే రేవంత్‌రెడ్డి అత్యంత డేంజర్ అని విమర్శలు చేశారు. రేవంత్‌రెడ్డిని ప్రత్యామ్నాయంగా ప్రజలు ఎన్నుకుంటే పాత ఆఫీసర్లనే ఎందుకు కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వంలో అత్యంత అవినీతి అధికారులు ఉన్నారని ఆరోపించారు. ముందు అధికారుల మీద విచారణ చేస్తే ఎవరు సమర్ధవంతమైన వారో తెలుస్తుందని ఎంపీ ధర్మపురి అరవింద్ పేర్కొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com